
70 టీఎంసీలు దాటిన సోమశిల



అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం 70 టీఎంసీలు దాటింది. ఎగువ నుంచి ఆదివారం 17,650 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 70.241 టీఎంసీలకు చేరుకొంది. దిగువ డెల్టాకు 2100, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, వేదికపై మంత్రులు నారాయణ, ఆనం, జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్, జేసీ తదితరులు

కలిసికట్టుగా అభివృద్ధి చేస్తాం

- డీఆర్సీలో చర్చించిన సమస్యలకు పరిష్కారం
- గ్రామ సచివాలయాల పనితీరుపై సమీక్షించాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- పలు శాఖలపై సుదీర్ఘ చర్చ
- వేమిరెడ్డికి అవమానం.. వెళ్లిపోయిన ఎంపీ

నెల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలోని ప్రజాప్రతినిధులందరితో కలిసికట్టుగా పనిచేస్తాం.. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం'.. అని ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. గతంలో తాను మంత్రిగా, డీఆర్సీ చైర్మన్‌గా ఉన్నప్పుడు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు మేలు చేస్తామని పేర్కొన్నారు. జిల్లా సమీక్ష మండలి(డీఆర్సీ) సమావేశం మంత్రి ఫరూక్ అధ్యక్షతన ఆదివారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రధానమైన 11 శాఖలపై సమీక్ష నిర్వహించాలని తొలుత భావించినా, కీలకమైన శాఖలపై చర్చలకే ఎక్కువ సమయం పట్టింది. ఇరిగేషన్, వ్యవసాయం, దాని అనుబంధ శాఖలు, డ్వామా, పంచాయతీరాజ్ శాఖలపై సుదీర్ఘంగా సమీక్ష జరిగింది. ఆయా శాఖల్లోని పురోగతిని ఉన్నతాధికారులు వివరించారు. ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గాల్లోని సమస్యలను ప్రస్తావించారు. వీటిపై మంత్రులు ముగ్గురూ స్పందిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ డీఆర్సీలో చర్చించిన ప్రతీ సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఆ వివరాలను వచ్చే సమావేశంలోపు ఆయా ఎమ్మెల్యేలకు తెలియజేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సచివాలయాల పనితీరుపై సమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖలో ఓఅండ్ఎం పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఆమంచర్ల ఇండస్ట్రియల్ పార్కు వివాదంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఓ ఆనంద్, జేసీ కే కార్తీక్, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, బల్లి కల్యాణ చక్రవర్తి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించాలి



కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించి జిల్లాలోని రైతులు, వ్యాపారులను ఆదుకోవాలి. బియ్యం, రొయ్యలు, మిర్చి, పత్తి, గ్రానైట్ ఎగుమతులు అయ్యేలా చూడాలి. జిల్లాలో పలువురు గిరిజనులకు సంక్షేమ పథకాలు అందడం లేదు. కొందరికి ఆధార్ కార్డులు కూడా లేవు. ప్రత్యేక డ్రైవ్ పెట్టి గిరిజనులను ఆదుకోవాలి. సచివాలయాల్లో సిబ్బంది చాలా మంది ఖాళీగా ఉంటున్నారు. వీరి పనితీరును పరిశీలించి అవసరం మేరకు ఉపయోగించుకోవాలి. 2019-24 మధ్యన వ్యవసాయాన్ని నాశనం చేశారు. కానీ మేము ప్రతీ గ్రామంలో రైతుల భాగస్వామ్యంతో పనులు చేయిస్తున్నాం.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

ఇండస్ట్రియల్ పార్కు వివాదం పరిష్కరించాలి



ఆమంచర్ల వద్ద 562 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు కోసం 2018లో టీడీపీ ప్రభుత్వం రూ.50 కోట్లు రైతులకు చెల్లించి భూసేకరణ చేసింది. అంతా అయిపోయాక అటవీ శాఖ ఆ భూములపై వివాదం చేసింది. అనేకమార్లు దీనిపై విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. రూపాయి ఖర్చు లేని పని ఇది. ఈ వివాదాన్ని పరిష్కరిస్తే 10 వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. పొట్టేపాలెం కలుజు మీద బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలి. కొమ్మరపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేయాలి.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

యూరియా ధరల్లో తేడా ఎందుకు?



యూరియా ధరల్లో పీఏసీఎస్‌లకు, డీలర్లకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటోంది. ఒక బస్తాకు రూ.68 తేడా ఎందుకు ఉంటోంది..? పీఏసీఎస్‌లకు సరిపడా యూరియా నిల్వలు సరఫరా చేయకపోతే రైతులు డీలర్ల వద్ద కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అప్పుడు వారిపై ఆర్థిక భారం పడుతుంది. ఎక్కువగా సాగు జరుగుతున్న నేపథ్యంలో యూరియా దొరకదన్న ఆందోళన రైతుల్లో ఉంది. దీనిపై అధికారులు అవగాహన కల్పించాలి. రాళ్లపాడుకు సోమశిల నుంచి రావాల్సిన వాటాను సక్రమంగా అందించాలి.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

లస్కర్లకు జీతాలు చెల్లించాలి



సాగునీటి యాజమాన్యంలో లస్కర్లు కీలకం. వారికి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలి. నీటి సంఘాల ఎన్నికల్లో కొత్త ఓటర్లపై దృష్టి పెట్టి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలి. కోవూరు నియోజకవర్గంలో ఆయకట్టుకు తగ్గట్లుగా ఓఅండ్ఎం వర్కులు మంజూరు చేయలేదు. దీంతో చాలా కాలువల్లో పూడిక తీత పనులు చేయలేక ఇబ్బందులు పడుతున్నాం. రానున్న సీజన్‌కు సరిపడా యూరియా నిల్వలను ఉంచుకోవాలి. ధాన్యం నిల్వ చేసుకునేందుకు మార్కెటింగ్ శాఖ గోదాములు సిద్ధం చేయాలి.

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

నిధులు మంజూరు చేయాలి

దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే



మా ప్రాంతంలో కాలువలు, చెరువులు ఇటీవల వర్షాలకు దెబ్బతిన్నాయి. వాటిని బాగు చేసేందుకు ఇరిగేషన్ అధికారులు ఎస్టిమేషన్లు వేసి ప్రభుత్వానికి పంపలేదు. మైనర్ ఇరిగేషన్ యాక్టివ్‌గా

(మిగతా 6లో)

బదిలీల్లో గందరగోళం

- తప్పుల తడకగా సీనియారిటీ జాబితా
- మున్సిపల్ టీచర్లలో అయోమయం
- ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం

నెల్లూరు(విద్య), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మున్సిపల్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతుల వ్యవహారం గందరగోళంగా మారింది. మున్సిపల్ టీచర్ల నియామకాలు, పదోన్నతులను గతంలో మున్సిపల్ అధికారులే నిర్వహిస్తుండేవారు. ప్రస్తుతం వీరి సర్వీసులన్నీ కూడా పాఠశాలవిద్య పరిధిలోకి వచ్చాయి. దీంతో విద్యాశాఖ సమక్షంలో పదోన్నతులు, బదిలీలు చేపట్టారు. ప్రభుత్వ, జడ్పీ యాజమాన్య టీచర్లతో సమానంగా ప్రస్తుతం మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌కు హెచ్ఎంలుగా, ఎస్‌జీటీలుగా పనిచేస్తున్న టీచర్లకు ఎస్ఏలుగా పదోన్నతులు కల్పించేందుకు షెడ్యూల్ ప్రకటించారు. ఈ మేరకు సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అయితే ఈ జాబితాను పరిశీలించిన ఉపాధ్యాయులు అయోమయానికి గురై అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. జాబితా అంతా తప్పులతడకగా ఉందని, వెంటనే సరిదిద్ది పదోన్నతులు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నెల్లూరులో 68, గూడూరులో 18, కావలిలో 21 కలిపి మొత్తం 107 మున్సిపల్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 630 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో ఎస్‌జీటీల నుంచి తగిన అర్హతలు కలిగిన వారికి ఆయా సబ్జెక్ట్‌ల్లో అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించనున్నారు. అయితే నాడు మునిసిపల్ శాఖ పరిధిలో ఉన్న సమయంలో ఈ పాఠశాలల్లో డీఎస్సీతో సంబంధం లేకుండా ఉపాధ్యాయులను నియమించారని, వీరిలో కొందరిని 1996 డీఎస్సీలో నియమించినట్లు సీనియారిటీ జాబితాలో చేర్చారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అప్పట్లో నియమితులైన పండిట్లను కూడా పదోన్నతుల జాబితాలో చేర్చారని, తెలుగులో పీజీ, బీఈడీలో తెలుగు మెథడాలజీ చదవి ఎస్ఏ పదోన్నతులకు అర్హులైన వారిని జాబితాలో చేర్చలేదని అంటున్నారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, 2019లో పదోన్నతి పొందిన వారి పేర్లు సీనియారిటీ జాబితాలో చేర్చడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటినీ సరిదిద్దకుంటే మాత్రం ఆందోళన చేస్తామని ఆయా సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

పారదర్శకంగానే పదోన్నతులు

ఉపాధ్యాయ పదోన్నతుల విషయమంలో మున్సిపల్ అధికారులు అధికారికంగా ఇచ్చిన జాబితానే వెబ్‌సైట్‌లో ఉంచాం. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి తప్పులు సరిదిద్దుతాం. టీచర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సమస్యలేమైనా ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చు. పదోన్నతులను పారదర్శకంగానే నిర్వహిస్తాం.

- డాక్టర్ ఆర్.బాలాజీరావు, డీఈవో



నేటి నుంచి సిద్దలకోన తిరునాళ్ల


సిద్దలకోన ముఖద్వారం

సుమారు రెండువేల సంవత్సరాల చరిత్ర గల సిద్దలకోనలో ప్రతిఏటా కార్తీకమాసంలో నవకోటి సిద్దేశ్వర, నవనాథ సిద్దేశ్వర, శిష్యుడు సారంగధర స్వాములకు తిరునాళ్ల నిర్వహిస్తారు. ఈ క్రమంలో కార్తీకమాసం తొలి సోమవారం (నేటి నుంచి) తిరునాళ్ల జరగనున్నది. ఈ మాసంలో వచ్చే అన్నీ సోమవారాల్లోనూ ఉత్సవాలు నిర్వహిస్తారు. కాగా మూడో సోమవారానికి అత్యంత ప్రాధాన్యం ఉంది ఆ ఒక్కరోజే వేలాదిమంది భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. జిల్లా నలుమూలల నుంచే కాక తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలిరానున్నారు.

6

కలిసి నడుద్దాం.. ఐక్యత నిలుపుదాం !

జిల్లా కూటమి నేతల సమావేశంలో తీర్మానం ● ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి ఫరూక్


టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్, పాల్గొన్న మంత్రులు ఫరూక్, ఆనం, ఎంపీ వేమిరెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

నెల్లూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల నేతలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని, కూటమి ఐక్యతను నిలుపుకోవాలని ఆయా పార్టీల నేతలు తీర్మానించారు. ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన తెలుగుదేశం, జనసేన, బీజేపీల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, టీడీపీ జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, జనసేన నాయకులు, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, నూనె మల్లికార్జున యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్, ప్రధాన కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● **సఖ్యతపై చర్చ**

ఈ సమావేశంలో ప్రధానంగా కూటమిలోని మూడు పార్టీల నాయకుల మధ్య సఖ్యతపై చర్చ జరిగింది. ప్రభుత్వ, రాజకీయ కార్యక్రమాల్లో జనసేన, బీజేపీ నాయకులను కలుపుకొని వెళ్లడం లేదనే ఆవేదన ఆ పార్టీల నాయకుల నుంచి వ్యక్తమైంది. దీనిపై ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ స్పందిస్తూ నియోజక వర్గ స్థాయిలో జనసేన,బీజేపీ నాయకుల పేర్లు సూచిస్తే వాటిని పార్టీ అధిష్ఠానం ముందు ఉంచి నియోజకవర్గ స్థాయిలో ఆ నాయకు లను కలుపుకొని వెళ్లేలా టీడీపీ ఎమ్మెల్యేలకు, నాయకులకు సూచనలు చేస్తామన్నారు. నామినేటెడ్ పదవుల విషయంలోనూ న్యాయం జరిగేలా చూడాలని జనసేన,బీజేపీ నాయకులు మంత్రుల దృష్టికి తెచ్చారు. ఇందుకు ఫరూక్ సమాధానం ఇస్తూ నామినేటెడ్ పదవుల విషయంలో కూటమి అగ్రనాయకులతో హైలెవల్ కమిటీ వేశారని, ఎవరికి ఏ పదవులు ఇవ్వాలనే విషయాన్ని ఆ కమిటీ చూసుకుంటుంది తప్ప మంత్రులు, ఎమ్మెల్యేలకు సంబంధం ఉండదని వివరించారు. జిల్లా స్థాయిలో కూటమి నాయకులంతా కలిసి కట్టుగా ముందుకు సాగాలని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయిలో కూటమి నాయకులందరూ సమష్టిగా చర్చించి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. కూటమి ఐక్యత మరింత బలపడేలా మూడు పార్టీల నాయకులు బాధ్యతతో వ్యవహరించాలని సమావేశానికి హాజరైన నాయకులు పేర్కొన్నారు.

సత్ఫలితాలిస్తున్న వారోత్సవాలు


డ్రైవర్లతో మాట్లాడుతున్న ఆర్టీసీ జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు(ఫైల్)

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఆర్టీసీ కళ్లు తెరిచినట్లుగా కనిపిస్తోంది. గతంలో ఆదాయం కోసం ఉద్యోగులను రకరకాలుగా ఇబ్బందులకు గురిచేసిన ఆర్టీసీ తాజాగా ప్రతి నెలా డ్రైవర్ల సంతోషకర వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నెలలో ప్రారంభమైన (2వతేదీన) ఈ వారోత్సవాలకు డ్రైవర్ల నుంచి విశేష స్పందన లభించింది. ఇక ఆర్టీసీ జోన్ ఈడీ ఈ వారోత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతి డిపోలో డ్రైవర్లతో సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు.

● **ప్రతినెలా 7వరకు వారోత్సవాలు**

ఈ వారోత్సవాలను ప్రతినెలా ఒకటోతేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా ఒకటో నుంచి 3వ తేదీ వరకు బస్సులు నడిపే డ్రైవర్ల నుంచి బస్సుకు సంబంధించిన ఇబ్బందులు, మరమ్మతులు సమాచారం తీసుకుంటారు. 4 నుంచి 7 వరకు డ్రైవర్లు చెప్పిన సమస్యలను పరిష్కరించి, ఆ వివరాలను వారికి తెలియజేస్తారు. దీంతో చిన్నపాటి మరమ్మతులను సైతం డ్రైవర్లకు అనుగుణంగా ఆర్టీసీ గ్యారేజీలో పరిష్కరిస్తారు.

డ్రైవర్లు సంతోషంగా ఉంటే సంస్థకు ఆదాయం

ఆర్టీసీ గ్యారేజీలో ఆయా డిపోలకు చెందిన బస్సులను రెగ్యులర్‌గా మరమ్మతులు చేస్తూనే ఉంటారు. అయితే గేరు సౌండ్ రావడం, బ్రేక్ పట్టేయడం, స్టీరింగ్‌లో చిన్న సమస్యలు, అద్దాలు లేకపోవడం తదితర సమస్యలను పెద్దగా పట్టించుకోరు. సంతోషకర వారోత్సవాల ద్వారా అధికారులు మొదటి వారంలో ప్రతి డ్రైవర్‌తో మాట్లాడి బస్సులో ఉన్న సమస్యలను తెలుసుకుంటారు. ఆ తరువాత సమస్యలను పరిష్కరిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా డ్రైవర్లు సంతోషంగా ఉంటారు. వారు సంతోషంగా ఉంటేనే సంస్థ ఆదాయం పెరుగుతుంది.

- గిడుగు వెంకటేశ్వరరావు, ఆర్టీసీ జోన్ ఈడీ

కండలేరు నీరు వచ్చేనా... పొదలకూరు దాహార్తి తీర్చేనా ?



పొదలకూరుకి తాగునీటిని సరఫరా చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కండలేరు నుంచి ప్రత్యేక పైపులైను ద్వారా తాగునీటిని అందించేందుకు నిధులు మంజూరు చేసింది. ఫిబ్రవరిలో టెండర్లు పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. అయితే వేసవిలో పట్టణవాసులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాల్సిన గత ప్రభుత్వ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.దీంతో నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది. ఇప్పటికీ పైపులైను పనులు పూర్తికాలేదు. పనులు ఎప్పుడు పూర్తవుతాయో.. తాగునీరెప్పుడు అందుతుందోనని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు.

(వివరాలు 6లో)

ఎన్‌డీసీఎంఎస్ ప్రక్షాళన

- అక్రమ నియామకాల రద్దుకు ఆదేశాలు
- ఆదాయమార్గాలపై దృష్టి

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 3: నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఎన్‌డీసీఎంఎస్)లో ప్రక్షాళన ప్రారంభమైంది. గత పాలకవర్గంలో సహకార చట్టాలకు విరుద్ధంగా కొందరిని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో నియమించటంతో ఎన్‌డీసీఎంఎస్ ప్రత్యేకాధికారి, జేసీ కార్తీక్ వారిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాక డీసీఎంఎస్ ఆదాయ మార్గాలపై దృష్టి సారించారు. గత పాలకవర్గంలో ఎన్‌డీసీఎంఎస్‌లో 11 మందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాల్లో నియమించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వారికి విధులు లేకపోవటం, చెల్లించటానికి నిధులు లేకపోవటంతో వారు సంస్థకు పెద్ద భారమని జేసీ విచారణలో తేలింది. దీంతో ఎన్‌డీఎంఎస్ ప్రక్షాళనకు ఆయన పూనుకు న్నారు. 11 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు నిరంజన్‌రెడ్డి అనే సేల్స్‌మన్‌ను కూడా విధుల నుంచి తొలగిం చారు. సేల్స్‌మన్ నిధుల దుర్వినియోగానికి పాల్పడడం, ఆయనపై క్రిమినల్ కేసు నమోదుకావడంతో విధుల నుంచి తప్పించారు. ఎరువులు, పురుగుమందుల వ్యాపారాల ద్వారా ఓ వెలుగు వెలిగిన ఎన్‌డీఎంఎస్‌లో కొత్తగా జనరిక్ మందుల దుకాణాన్ని ఏర్పాటు చేశారు. అలాగే నగరంలో ఎన్‌డీసీఎంఎస్‌కు సంబంధించి రైస్‌మిల్లు కూడా ఉంది. దాని స్థానంలో వ్యాపార సముదాయం నిర్మాణానికి జేసీ చర్యలు తీసుకుని, డీసీఎంఎస్ అభివృద్ధికి బాటలు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



(5వ పేజీ తరువాయి)

లేదు. చాలా కాలువల్లో పూడిక పేరుకుపోయి ఉంది. మాకు ఏదో ఒక ఫండ్ కింద నిధులు మంజూరు చేయాలి. చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలి. గతంలో టెండర్లు పిలిచినా కొన్ని రోడ్డు పనులు పూర్తి చేయలేదు. వీటిని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

● ఫ్లైవోవర్ నిర్మించాలి



నెల్లూరు నగర పరిధిలోని చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఫ్లైవోవర్ నిర్మించాలి. ఇది నగర ప్రజలకు చాలా అవసరం. ఫ్లైవోవర్ నిర్మించినప్పటికీ ముత్తు కూరు గేట్ జంక్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఇక్కడ సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. జాఫర్‌సాహెబ్ కాలువకు చేసిన రివిట్‌మెంట్ రోడ్డు లెవల్‌కు సరిపోయింది. దీని మూలంగా ప్రమాదాలు జరిగే అవకాశ ముంది. ఈ కాలువ వెంబడి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

\- పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ

కలిసికట్టుగా అభివృద్ధి చేస్తాం



అవమానం జరిగిందని సభ నుంచి వెళ్లిపోతున్న వీపీఆర్



మంత్రుల ముచ్చట్లు

● ఎంపీ వేమిరెడ్డికి అవమానం

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి డీఆర్సీలో అవమానం జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం ప్రారంభం కాగానే ముగ్గురు మంత్రులతో పాటు ఎంపీ వేమిరెడ్డి కూడా వేదికపై ఆశీనులయ్యారు. నెల్లూరు ఆర్డీవో అనూష.. ప్రొటోకాల్ ప్రకారం వరుస క్రమంలో అందరినీ వేదికపైకి ఆహ్వానించారు. వీరికి అధికారుల చేత బొకేలు ఇప్పించారు. అయితే ఎంపీ వేమిరెడ్డిని మాత్రం విస్మరించారు. దీంతో అవమానంగా భావించిన వేమిరెడ్డి.. వెంటనే తన సీట్లో నుంచి లేచారు. 'రెస్పెక్ట్ ఇవ్వడం తెలుసుకోవాలి' అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేదిక నుంచి దిగి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఒక్కసారిగా సమావేశ మందిరం సైలెంట్ అయిపోయింది. వెంటనే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ప్రశాంతిరెడ్డి, ఆర్డీవో అనూషలు వేమిరెడ్డికి సర్దిచెప్పేందుకు వెనకాలే వెళ్లారు. కానీ అప్పటికే ఎంపీ కారులో ఎక్కి జడ్పీ నుంచి వెళ్లిపోయారు. ఆ వెంటనే లోపలికి వచ్చిన మంత్రి ఆనం.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేదిక మీదకు ఎంపీ వచ్చాక ఆహ్వానించకపోవడం పొరపాటని అన్నారు. అందరి తరఫున వేమిరెడ్డికి క్షమాపణలు చెబుతున్నట్లు ప్రకటించారు. మళ్లీ ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆనం ఆదేశించారు. ఈ విషయంలో అధికారుల తీరుపై ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కూడా అసహనం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల విషయంలో గౌరవంగా వ్యవహరించాలని, మళ్లీ ఇటువంటి పొరపాట్లు జరగకూడదని అధికారులను ఆదేశించారు.



ఎమ్మెల్సీలతో కోటంరెడ్డి మాటామంతి

నేటి నుంచి సిద్ధలకోన తిరునాళ్ల

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా సిద్ధేశ్వర కోన

ప్రత్యేక ఆకర్షణగా దక్షిణామూర్తి ఆలయం



స్వయంభువులై వెలసిన సిద్ధులు

సైదాపురం, నవంబరు 3: ఆహ్లాదకరమైన అడవుల్లో.. ఎతైన కొండపై.. పెద్ద సొట్ట బండరాయి లోపల స్వయంభువుగా వెలసిన సిద్ధులకోన (సిద్ధేశ్వరకోన) ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇది మండల కేంద్రమైన సైదాపురానికి 3 కి.మీ. దూరంలో ఉంది. రెండు వేల సంవత్సరాల చరిత్ర గల ఈ క్షేత్రంలో ప్రతి ఏటా కార్తీకమాసంలో నవకోటి సిద్ధేశ్వర, నవనాథ సిద్ధేశ్వర, శిష్యుడు సారంగధర స్వాములకు తిరునాళ్ల నిర్వహిస్తారు. ఈ క్రమంలో నేటి నుంచి (కార్తీక మాసం తొలి సోమవారం) తిరునాళ్ల జరగనున్నది. కార్తీక మాసంలో వచ్చే అన్నీ సోమవారాల్లోనూ ఉత్సవాలు నిర్వహిస్తారు. కాగా మూడో సోమవారానికి అత్యంత ప్రాధాన్యం ఉంది ఆ ఒక్కరోజే వేలాదిమంది స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.

● ఇతర రాష్ట్రాల నుంచి భక్తుల రాక

సిద్ధలకోన తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచే కాక తెలంగాణ, చెన్నై, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. సంతానం లేని వారికి సంతానం కలిగినప్పుడు వారి పిల్లలకు సిద్ధలయ్య, సిద్ధమ్మ, సారంగయ్య వంటి పేర్లు పెట్టుకుంటారు.

● మంత్రపుష్పం ప్రత్యేకత

నవకోటి సిద్ధేశ్వర, నవనాథ సిద్ధేశ్వర స్వాముల వారి శిరస్సుపై పూజారులు పుష్పాలను పెట్టి మంత్రాలు చదువుతారు. పుష్పం స్వామివారి నుదుటన కుడివైపు కిందకు పడితే త్వరలోనే కోరిక నెరవేరుతుందని, పుష్పం వెనుక భాగంలో పడితే కోరిక నెరవేరదని భక్తుల విశ్వాసం. కోర్కెలు నెరవేరిన భక్తులు ఆలయాభివృద్ధికి విరాళాలు అందచేస్తుంటారు.

● దొనల ప్రత్యేకత

మంచినీరు, పసుపునీరు, చెక్కపొడి, శీకాయ, కుంకుమ, గంధం, విభూది, సంతానం దొనల్లో నిత్యం నీరు ఉంటుంది. ఈ దొనల్లో మహిళలు స్నానం చేసి సంతానం కోసం స్వామివార్ల ముందు వరపడినప్పుడు స్వప్నంలో స్వామివారు పూలు, పండ్లు ఇస్తారని, దీంతో తప్పనిసరిగా సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. వర్షాలు కురవకపోయినా దొనల్లో మాత్రం నీరు ఉంటుంది.

● నవగ్రహ మండపం ప్రత్యేకత

సిద్ధేశ్వరకోన కొండరాళ్లలో నాగపడిగలు ఉన్నందున నాగ దోష నివారణకు రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఒక్కొక్క నవగ్రహానికి ఒక్కొక్క గుడిని నిర్మించారు. ప్రతి శనివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి నవగ్రహాలకు శాంతి పూజలు నిర్వహిస్తారు.



దక్షిణామూర్తి ఆలయ ముఖద్వారం

● ఆధ్యాత్మిక నిలయం దక్షిణామూర్తి ఆలయం

సిద్ధేశ్వరకోనకు దక్షిణ దిశలో దక్షిణామూర్తి ఆలయం ఉంది. ఇక్కడ ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంది. సిద్ధలకోనను దర్శించుకున్న భక్తులు దక్షిణామూర్తిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. కార్తీక మాసంలోనూ, ఇతర పండుగ రోజుల్లోనూ ఇక్కడ ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.



గర్భాలయంలో దక్షిణామూర్తి

టీడీపీ ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట

● మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నెల్లూరులోని బలిజ (కాపు) భవన్‌లో డాక్టర్ పోకల రవి సహకారంతో బలిజ మెరిట్ విద్యార్థులకు పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ 104 మంది బలిజ మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు డాక్టర్ పోకల రవి రూ.4.80లక్షలు అందచేయటం అభినందనీయమన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదవే ఏకైక మార్గమన్నారు. కాపు భవన్‌లో మిగిలిన పనులన్నీ త్వరలో పూర్తి చేయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని మాటిచ్చారు. నెల్లూరు ప్రజలు అందించిన సహకారంతో చరిత్రలో నిలిచి పోయేలా రాష్ట్ర రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, అళహరి సుధాకర్, బలిజ సామాజికవర్గ నాయకులు అనిల్‌కుమార్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు పురస్కారం అందచేస్తున్న మంత్రి నారాయణ

హాకీ క్రీడతో ఉజ్వల భవిత

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(విద్య), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడ అయిన హాకీలో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నెల్లూరు రూరల్ సౌత్‌మోపూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-17 బాల, బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఆదివారం మొదలయ్యాయి. వాటిని అరుణమ్మ ప్రారంభించి ప్రసంగించారు. జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో నూ ఉత్తమంగా రాణిస్తే ఎన్నో అవకాశాలను అందుకోవచ్చని, ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈవో బాలాజీరావు, డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ఆర్ఐపీ ఎస్‌కే మహబూబ్‌బాషా, రాష్ట్ర పరిశీలకుడు రవిరాజ, విద్యా కమిటీ చైర్మన్ పెంచలయ్య, జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య కార్యదర్శి ఎన్ విజయ, పోటీల నిర్వాహక కార్యదర్శి పీ నాగేంద్రరావు, పర్యవేక్షకుడు పీ థామస్‌పీటర్, జీడీ సురేష్‌బాబు, పీఈటీలు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

ఉత్సాహంగా పోటీలు...

రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. తొలిరోజు పోటీల్లో బాలుర విభాగంలో శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్లు తలపడగా తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. ప్రకాశం, కర్నూలు జట్లు తలపడగా ప్రకాశం జట్టు గెలుపొందింది. బాలికల విభాగంలో నెల్లూరు, పశ్చిమగోదావరి జట్లు తలపడగా పశ్చిమగోదావరి జట్టు విజయం సాధించింది. ఈ పోటీలను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు పర్యవేక్షించారు.

కండలేరు నుంచి పైపులైను ఎప్పటికి పూర్తయ్యేనో ?

● జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా పనులు

● గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నేటికీ పూర్తికాని వైనం

పొదలకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి తాగు నీటిని సరఫరా చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కండ లేరు నుంచి ప్రత్యేక పైపులైను ద్వారా తాగు నీటిని అందించేందుకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.3.93 కోట్లతో ప్రత్యేక పైపులైను నిర్మాణం చేపట్టింది. ఫిబ్ర వరిలో టెండర్ల పూర్తయి వేగంగా పనులు ప్రారంభమయ్యాయి. దీంతో తాగునీటి ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని పట్టణ ప్రజలు భావించారు.

● గత పాలకుల నిర్లక్ష్యం

వేసవిలో గ్రామీణ ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాల్సిన గత ప్రభుత్వ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. లేదంటే ఎన్నికల సమయానికంటే ముందే పైపులైను నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. పనులు మందగించడంతో నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది. మండలంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి మంచినీటిని అందించేందుకు రూ.17.39కోట్లు మంజూరయ్యాయి. ఒక్క పొదలకూరు తాగునీటి అవసరాల కోసం రెండు పనులుగా రూ.2.42కోట్లు, రూ.1.51కోట్లు మంజూరు చేశారు. శరవేగంగా పనులను చేపట్టేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులను దిగుమతి చేయించారు. రాపూరు నుంచి పట్టణానికి పైపులైను నిర్మాణ పనులు 80 శాతం పూర్తి చేశారు. మర్రిపల్లి (దిగువ) గ్రామానికి కూడా మంచినీటిని సరఫరా చేసేందుకు గ్రామంలో ఓవర్ హెడ్‌ట్యాంక్‌ను నిర్మించారు. పట్టణంలోని వినాయకమాన్యంలో ట్యాంక్‌ను నిర్మించి సుమారు 50 శాతం ప్రజలకు నీటి అవసరాల కోసం ప్రత్యేక పైపులైను ద్వారా కండలేరు జలాలను తీసుకొచ్చి సరఫరా చేసేందుకు అంచనా వేశారు. మిగిలిన 50 శాతం అవసరాల కోసం పట్టణంలో ఉన్న ట్యాంక్ నుంచి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేశారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా 2020లోనే మండలంలో 34 గ్రామాలను ఎంపిక చేశారు. 27పనులకు సంబంధించి టెండర్లు పూర్తి చేశారు. వీటిలో కొన్ని పనులను అధికారులు పూర్తి చేశారు. ప్రస్తుతం కండలేరు పాత పైపు లైను నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్నా కొంత కాలంగా సక్రమంగా అందడం లేదని పంచాయతీ పాలకులు తెలిపారు. నిర్మాణంలో ఉన్న పైపులైను ఎప్పటికి పూర్తవుతుందోనని పట్టణవాసులు ఎదురుచూస్తున్నారు.



కండలేరు పైపులైను పనులు చేస్తున్న కూలీలు



కాకర్లవారి పాలెంలో డ్రైనేజీలను శుభ్రం చేయక పోవడంతో రోడ్లపైన పారుతున్న మురుగునీరు

అదుపులోకి రాని విష జ్వరాలు

● రోజురోజుకు పెరుగుతున్న కేసులు

● తగ్గినట్లే తగ్గి మళ్లీ తిరగబెడుతున్న వైనం

● ఆందోళనలో జ్వరపీడితులు



వలేటివారిపాలెం పీహెచ్‌సీలో చికిత్సపొందుతున్న కర్లవారిపాలెం జ్వరపీడితులు

వలేటివారిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకర్లవారిపాలెం, అమ్మపాలెం గ్రామాల్లో విష జ్వరాలు గత 20రోజుల నుంచి అదుపులోకి రావడం లేదు. వైరల్ ఫీవర్ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. జ్వరాలు తగ్గినట్లే తగ్గి మళ్లీ తిరగబెడుతున్నట్లు జ్వరపీడితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు, కాళ్ల నొప్పులు, ఒళ్ల నొప్పులు, జలుబు, తుమ్ములు, దగ్గు, శరీరంపై దద్దుర్లు వస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఆ గ్రామాల్లో ఒక్కో ఇంటిలో ఇంటికొకరిద్దరు మరికొన్ని ఇళ్లలో ఇంటిల్లిపాది జ్వరపీడితులు మంచం పట్టారు. కాకర్లవారిపాలెం, అమ్మపాలెంలోని జ్వరపీడితులతో వలేటివారిపాలెం పీహెచ్‌సీ, ఆర్ఎంపీ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి.

● తగ్గుతున్న ప్లేట్‌లెట్లు

ఈ రెండు గ్రామాల్లోని జ్వర బాధితుల్లో చాలా మందికి ప్లేట్‌లెట్స్ తగ్గిపోతున్నాయి. చాలా మంది కందుకూరు, ఒంగోలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వేలు ఖర్చుచేసి చికిత్స పొందుతున్నారు. వైద్యాధికారులు, వైద్యసిబ్బంది గ్రామాల్లో తూతూమంత్రంగా వైద్య శిబిరాల నిర్వహిస్తున్నారు.

● మొక్కుబడిగా పారిశుధ్య పనులు

ఈ రెండు గ్రామాల్లో పూర్తిస్థాయిలో దోమల నివారణ, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం లేదు. మురుగుకాలువల్లో పూడికతీసి మురుగునీరు ముందుకు పోయేలా చర్యలు చేపట్టడం లేదు. ఈ సమస్యతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేయడం లేదు. లార్వా దోమను నివారణకు ఎబెట్ ద్రావణంతో పిచికారీ చేయడం లేదు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టి జ్వరపీడితుల నుండి రక్తనమూనాలు సేకరించి రక్త పరీక్షలు నిర్వహించడం లేదు. అంతేగాకుండా తొట్టెలలో నీళ్ల లేకుండా, కొబ్బరిబోండాలు టైర్లలో నీళ్ల నిల్వ లేకుండా ప్లాస్టిక్, డిస్పోజల్ గ్లాసుల్లో నీరు నిల్వ లేకుండా అవగాహన కల్పించడం లేదు. జ్వరపీడితులకు ఒకట్రెండు టాబ్లెట్లు ఇచ్చి నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్లు జ్వరపీడితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టి జ్వరాలు తగ్గేవరకు వైద్యశిబిరం నిర్వ హించాలని ప్రజలు కోరుతున్నారు.

15 రోజుల నుంచి జ్వరం తగ్గడం లేదు



కాకర్లవారిపాలెం ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మురుగు కాలువల్లో చెత్త చెదారంతో నిండిపోయి మురుగునీరు ముందుకు పోవడం లేదు. దీంతో మురుగునీరు ఇళ్ల ముందు రోడ్డుపై నిలబడి ఉంది. 15రోజుల కిందట తనకు జ్వరం వచ్చి ఇప్పటికీ తగ్గలేదన్నారు. కాళ్ల నొప్పులు, ఒళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు దద్దుర్లు వస్తున్నాయి. నాతో పాటు ప్రతి ఇంటిలో ఒకరిద్దరు జ్వరాలతో చికిత్స పొందుతున్నారు.

\- కారుమంచి అబ్రహం, కాకర్లవారిపాలెం

బాలిక ఏమైంది?

వెంకటాచలం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లపాడుకు చెందిన ఓ బాలిక (15) అదృశ్యంపై బాలిక తల్లి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తెతో కలిసి స్థానికంగా ఉన్న చర్చికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఆమె కుమార్తె కనిపించకుండా పోయిందని, గ్రామానికి చెందిన శ్రీహరి అనే వ్యక్తి తీసుకెళ్లి ఉండవచ్చునని అనుమానిస్తూ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.



ఎన్నాళ్లకెన్నాళ్లకు..

ఐదేళ్ల తరువాత మనుబోలు పెద్ద చెరువులో పూడిక తీత పనులు చేపట్టారు. గత వైసీపీ పాలనలో పాలకులు, అధికారులు ఈ చెరువు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో తూములు, చెక్కలు దెబ్బతిన్నాయి. పూడికతీయ్యక చెట్లు, చేమ పెరిగి సాగునీటికి అవరోధంగా మారింది. వర్షాలు వచ్చినప్పుడల్లా చెరువునీటిని కిందకు వదిలేందుకు రైతులు నానా తంటాలు పడేవారు. ఈ సమస్యను మనుబోలు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి ఆయన ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. వర్షాలు కురిసేలోగా పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఆదివారం నుంచి చెరువులో ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు, దెబ్బతిన్న చెక్కలు, తూములు తీసి కొత్తవాటిని అమర్చేందుకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మనుబోలు రైతులు ఎమ్మెల్యే సోమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

- మనుబోలు(ఆంధ్రజ్యోతి)

వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ప్రాంగణంలోని పచ్చనిచెట్లు, రోడ్ల మధ్యన డివైడర్లలో ఏర్పాటు చేసిన పూల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వీటి వల్ల విద్యార్థులకు మానసిక ప్రశాంతత, ఉల్లాసం కలుగుతుంది. అంతేకాక యూనివర్సిటీకి న్యాక్ ఏ గ్రేడ్ రావడంలో పచ్చని ప్రకృతి ఎంతో దోహదం చేసింది.ఈ పచ్చని చెట్ల మధ్యలో విద్యార్థులు విద్యను అభ్యసించినట్లయితే ఓ మధురానుభూతిగా నిలుస్తుంది.

- వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి)



వీఎస్‌యూలోని రోడ్ల మధ్యలో ఉన్న పూలమొక్కలు

ఆహ్లాదకరం.. వీఎస్‌యూ ప్రాంగణం

జోరందుకున్న బెల్టు వ్యాపారం

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని అధికారులు



అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు(ఫైల్)

వరికుంటపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రవేశపెట్టిన నేపథ్యంలో నూతనంగా దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈతరుణంలో గ్రామాల్లో బెల్టు వ్యాపారం సైతం జోరందుకుంటోంది. అక్రమ మద్యం వ్యాపారం, బెల్టుషాపులపై దృష్టి పెట్టాల్సిన అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి బెల్టుషాపుల నిర్వాహకులతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పల్లెల్లో గతంలో కంటే బెల్టు వ్యాపారులు రెట్టింపు సంఖ్యలో పెరిగిపోతున్నారు. సీతారామపురం మండలంలోని బోడసిద్దాయపల్లి, సీతారామపురం తదితర గ్రామాల్లో బెల్టు వ్యాపారం జోరుగా సాగుతోంది. వరికుంటపాడు మండలం ఇస్కపల్లి, కాంచెరువు, గువ్వాడి, తూర్పుబోయమడగల, వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి, తూర్పుకొండారెడ్డిపల్లి, తూర్పురొంపిదొడ్ల, గణేశ్వరాపురం, నారసింహాపురం, విరువూరు ఉదయగిరి మండలం ఎర్రబల్లిగడ్డ, గండిపాళెం, కృష్ణంపల్లి, అప్పసముద్రం, దుత్తలూరు మండలం నందిపాడు, నర్రవాడ, ఏరుకొల్లు, బ్రహ్మేశ్వరం, తదితర గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఇవి చాలవన్నట్లు మద్యం దుకాణాలకు పక్కనే, టిఫిన్ సెంటర్లు, బడ్డీకొట్లు మద్యం సేవించడానికి కేంద్రాలుగా మారాయి. స్థానికంగా ఉంటూ వ్యాపారం చేయడంతో పాటు ఇటీవల మొబైల్ సర్వీసు పేరుతో మందుబాబుల వద్దకే సీసాలను సరఫరా చేసి అదనంగా రూ. 50 నుంచి రూ. 100వరకు వసూలు చేస్తుండడం గమనార్హం. వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లోను విచ్చలవిడిగా బెల్టు వ్యాపారం సాగిస్తూ బహిరంగంగానే మద్యం సేవిస్తున్నారు.

సెంటిమెంటుకు శ్రీకారం

ప్రభుత్వంతో సహా పాలసీ మారడంతో విలేజ్ సెంటిమెంట్లకు శ్రీకారం చుడుతున్నారు. అధికార మద్యం దుకాణాల నుంచి కొంత నగదును వసూలు చేయడంతో పాటు స్థానికంగా గ్రామాల్లోనే బెల్టు అమ్మకాలకు వేలంపాట నిర్వహించేందుకు చర్చలు ఊపందుకుంటున్నాయి. ఆవిధంగా వచ్చిన నగదును గ్రామాభివృద్ధికి వినియోగించుకోవచ్చని పెద్దలు సలహాలు ఇస్తూ అడ్డంకులు లేకుండా చేసుకుంటున్నారనే ప్రచారం ఊపందుకుంటోంది. పాట పడిన వ్యక్తులే బెల్టు సాగించాలని షరతులు విధిస్తున్నారు. దీంతో లాభసాటి వ్యాపారం కావడంతో పోటీతత్వం నెలకొనే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రక్రియను గుట్టుచప్పుడు కాకుండా నడిపించినట్లు తెలిసింది.

సీఎం హెచ్చరించినా ఫలితం శూన్యం

మద్యంఅమ్మకాల్లో నిబంధనలు అతిక్రమించినా, బెల్టు వ్యాపారాలు కొనసాగించినా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. ఇటీవల తమ గ్రామంలో అధికార మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ అధికారుల ఎదుట ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేయడం విశేషం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి అనధికార బెల్టు వ్యాపారానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంటేపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. గూడూరుకు చెందిన సుబ్రహ్మణ్యం దైవదర్శనం నిమిత్తం మోటార్‌బైక్‌పై గొలగమూడికి వెళ్తుండగా కంటేపల్లి సమీపంలో మలుపు వద్ద షడన్‌గా ఎదురు వచ్చిన ఆటో తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా అంతటా నాకాబందీ

- అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకే..



తనిఖీలు చేస్తున్న బాలాజీనగర్ పోలీసులు

నెల్లూరు(క్రైం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆసాంఘిక కార్యకలా పాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ జీ కృష్ణకాంత్ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా రాత్రి 11గంటల నుంచి 1 గంట వరకు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో నాకా బందీ చేపట్టారు. అన్ని కూడళ్లు, హైవే ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. జాతీయ రహదారులపై రాంగ్ రూట్‌లో వెళ్లవద్దని, గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ వంటివి నివారించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ ముమ్మరం చేయాలని సూచించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సైదాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరు గ్రామంలో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ కాంతి కుమార్ మాట్లా డుతూ చెత్త తయారీ కేంద్రం వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.5,920 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.



పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7591
వెండి కిలో ధర	రూ. 96,700
వెండి ఒక గ్రాము	రూ.99.70

అందని వేతనం..

అవస్థల్లో ఉద్యోగులు

- మూడునెలలుగా 108, 104, 102 సిబ్బందికి అందని జీతాలు
- అప్పులు చేసి బతుకుతున్నామని ఆవేదన
- ప్రభుత్వం కరుణించాలని వేడుకోలు



ఉదయగిరి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల్లో గాయపడినవారికి... అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తొలుత గుర్తుకొచ్చేది 108 అంబులెన్స్. అలాగే గ్రామాలకు వెళ్లి ప్రజలకు వైద్యసేవలు అందించడంతోపాటు నెలవారి మందులు అందిస్తున్నది 104 వాహనం. వైద్యశాలల్లో ప్రసవాలైనా మహిళలను ఇళ్లకు చేర్చేది తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు. ఇవన్నీ నిత్యం ప్రజలకు సేవలందించేవే. అయితే ఈ వాహనాల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న సిబ్బందికి మాత్రం మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదు. ఈ వాహనాలన్నింటినీ అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ నిర్వహిస్తోంది. సదరు సంస్థ ఉద్యోగులకు జీతాలు అందించకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి వేతనాలు అందించకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని, అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని వారు వాపోతున్నారు.

నిధులు రాగానే జీతాలు జమ చేస్తాం

108, 104, 102 ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు జమ చేయాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా రూ.140 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమవుతాయి.

- విజయకుమార్, జిల్లా ఇన్‌చార్జి మేనేజర్



కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకం

ఉమ్మడి జిల్లాలో 46 వాహనాలు 108 ఉండగా, ఉద్యోగులు, రిలీవర్లు కలిపి 230 మంది సిబ్బంది ఉన్నారు. ఒక్కో 108 వాహనంలో ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు ఈఎంటీలు విధులు నిర్వహిస్తారు. 104 వాహనాలు 46 ఉండగా, అందులో 100 మంది వరకు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. 104 వాహనంలో ఓ డ్రైవర్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ పని చేస్తుండగా, రిలీవర్లు ఆరుగురు ఉన్నారు. జిల్లాలో 19 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉన్నాయి. 102 వాహనంలో ఒక డ్రైవర్ మాత్రమే ఉంటారు. 108, 104, 102 ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు విడుదల చేయలేదు. 108లో పనిచేసే ఉద్యోగులకు సీనియర్ డ్రైవర్లకు ఒక్కొక్కరికి నెలకు రూ.28 వేలు, జూనియర్ డ్రైవర్లు ఒక్కొక్కరికి రూ.16 వేలు చెల్లిస్తారు. ఈఎంటీకి రూ.18 వేలు ఇస్తున్నారు. 104లో పనిచేసే వారికి సీనియర్ డ్రైవర్‌కు రూ.22 వేలు, జూనియర్ డ్రైవర్‌కు రూ.13 వేలు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు నెలకు రూ.12,292 వేలు ఇస్తున్నారు. 102 వాహనాల్లో పనిచేసే డ్రైవర్లకు నెలకు రూ.8,750లు వేతనంగా ఇస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా తమ వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని వీరంతా కోరుతున్నారు.

అబ్బుర పరిచిన విన్యాసాలు

- ముగిసిన రాష్ట్ర యోగా పోటీలు
- ప్రతిభ చూపిన బాల,బాలికలు





యోగా విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు



పోటీల్లో గెలుపొందిన విజేతలు

నెల్లూరు(విద్య), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో చిన్నారుల యోగా విన్యాసాలు అబ్బురపరిచాయి. బాల,బాలికలు యోగా విన్యాసాలతో అందరినీ విశేషంగా ఆకట్టుకున్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్-14, 17 బాల, బాలికల యోగా పోటీలు నెల్లూరు నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని పాత జిల్లాల ప్రకారం 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరై వివిధ విభాగాల్లో ప్రతిభ చూపారు. ఆసక్తిగా జరిగిన ఈ పోటీల్లో అండర్-14 బాలుర ఆర్టిస్టిక్ విభాగంలో ఎస్.సోహన్(నెల్లూరు), రిథమిక్ విభాగంలో సంతోష్(నెల్లూరు)లు ప్రథమస్థానం సాధించారు. ట్రెడిషనల్ విభాగంలో ఎస్.సాదన్(నెల్లూరు), కె.సంపత్ (గుంటూరు), ఎం.సంజయ్‌కుమార్ (తూర్పుగోదావరి), ఎస్.చరణ్‌దిలీప్(కర్నూలు), కె.వెంకట్(కర్నూలు)లు విజేతలుగా నిలిచారు. బాలికల ట్రెడిషనల్ విభాగంలో ఎస్.అప్సానా(కర్నూలు), డి.హర్షిత(విశాఖపట్నం), ఆర్.కౌషిక(కృష్ణ), దివ్యాంజలి(తూర్పుగోదావరి), ఝాన్సీలక్ష్మీ(విశాఖపట్నం)లు విజయం సాధించారు. అలాగే ఆర్టిస్టిక్ విభాగంలో వి.సాత్విక(తూర్పుగోదావరి), రిథమిక్ విభాగంలో లహరి దుర్గ(తూర్పుగోదావరి)లు విజేతలుగా నిలిచారు. అండర్-17 బాలుర ట్రెడిషనల్ విభాగంలో కె.కార్తిక్ రామచంద్రారెడ్డి(తూర్పుగోదావరి), ఎం.అశోక్‌కుమార్(అనంతపురం), ఎ.మనోహర్(కృష్ణ), ఎస్‌కె.అజీజ్(తూర్పుగోదావరి), జ్యోతిమహేంద్ర (నెల్లూరు)లు విజేతలుగా నిలిచారు. రిథమిక్ విభాగంలో దుర్గాభరణి, ఆర్టిస్టిక్ విభాగంలో కె.రామచంద్రారెడ్డిలు విజయం సాధించారు. బాలికల ట్రెడిషనల్ విభాగంలో ఐ.అర్పిత (పశ్చిమగోదావరి), పి.భార్గవి (గుంటూరు), తస్లీమ్ (పశ్చిమగోదావరి), వి.శ్రీముఖి(విశాఖ), హేమదనుశ్రీ (తూర్పు గోదావరి), రిథమిక్ విభాగంలో కె.వైష్ణవి(విశాఖ), ఆర్టిస్టిక్ విభాగంలో పావని(పశ్చిమగోదావరి)లు విజయం సాధించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కె.మహబూబ్ బాషా, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె.గురుప్రసాద్‌లు బహుమతులు అందచేశారు. విజేతలుగా గెలుపొందిన క్రీడాకారుల్లో ప్రథమస్థానం సాధించిన క్రీడాకారులు జాతీయ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ పూర్ణచంద్, జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య కార్యదర్శి ఎస్.విజయ, పోటీల నిర్వాహక కార్యదర్శి పి.థామస్‌పీటర్, పాఠశాల హెచ్‌ఎం. కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణ చేయకుండా

ఉద్యోగ నియామకాలు చేస్తే అడ్డుకుంటాం

- సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ చేయ కుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపడితే అడ్డుకుంటామని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ హెచ్చరించారు. నెల్లూరు లోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆదివారం ఎస్సీ వర్గీకరణ పరిరక్షణ సమితి జేఏసీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వర్గీకరణ చేయకుండా ఉద్యోగ నియా మకాలు చేపడితే మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 1996లో ఎస్సీవర్గకరణ చేసి మాదిగలకు న్యాయం చేశార న్నారు. తాజాగా సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు చేపట్టాలని తీర్పు ఇచ్చిందని, ముఖ్యమంత్రి వెంటనే ఎస్సీ వర్గీకరణ జరపాలని కోరారు. ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు పేరిపోగు వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ మాది గల 30 ఏళ్ల కలని, సామాజిక న్యాయం జరగాలంటే మొదట వర్గీకరణ జరగాలన్నారు. వర్గీకరణ చేయబోయేది సీఎం చంద్రబాబేనన్న నమ్మకం మాదిగల్లో ఉందన్నారు. ఇందుకోసం కృతజ్ఞత యాత్ర చేపడుతున్నామని చెప్పారు. మాది గలంతా విజయవా డకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానంతరం సుబ్బయ్య ఆధ్వ ర్యంలో నాయకులు వీఆర్సీ సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ చేయాలన్న డిమాండ్‌తో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు శేఖర్, జనార్దన్‌రావు, కొమ్మల కృష్ణయ్య, కుడుముల సుబ్బారావు, వేగూరు విజయ కుమార్, పీ చిన్నయ్య, జీవీ కృష్ణ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు

- వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): ముసునూరు గ్రామ పరిధిలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రూరల్ ఎస్ఐ జి.రాజేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. జాతీయ రహదారి- రైల్వే ట్రాక్‌కు మధ్యలో పొలాల్లో వ్యక్తి పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి ఈ విషయాన్ని వీఆర్వో రాగిపూడి సింగరయ్యకు సమాచారమిచ్చారు. ఈ మేరకు సంఘటన స్థలానికి వెళ్లి ఎస్ఐ పరిశీలించారు. మృతుడి వయసు 30- 40ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, నాలుగు రోజులు క్రిందట మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడు ప్యాంటు, షర్టు, రాకింగ్ స్టార్ అనే స్టిక్కర్ ఉండే బనియన్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం పక్కనే పురుగు మందు డబ్బా పడి ఉండడంతో ఆత్మహత్య చేసుకొని ఉంటాడనే అనుమానాలు వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని, వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కావలి ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన

వైసీపీ నాయకుడిపై కేసు నమోదు

కోవూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంశాఖామంత్రి వీ.అనితపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ నాయకుడు హరీశ్వర్‌రెడ్డిపై కోవూరు పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేస్తున్న వంగలపూడి అనితపై ఈ ఏడాది జనవరి 8న ఎక్స్ ఏపీపీ మాధ్యమంలో హరీశ్వర్‌రెడ్డి అనే వైసీపీ నాయకుడు అసభ్యకర పోస్టు పెట్టడంపై కోవూరు మండల టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు చెరుకూరు మహేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనిత పరువుకు నష్టం కలిగించే విధంగా పోస్టులు పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దళిత మహిళగా, టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేస్తున్న ఆమెపై పోస్టులు పెట్టినందు వల్ల దళిత మహిళల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నందు వల్ల తాను భయపడి అప్పట్లో ఫిర్యాదు చేయలేకపోయానన్నారు. ఫిర్యాదు ఆధారంగా ఎస్ఐ రంగనాథ్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


చేపల చెరువు తూముల ధ్వంసం

కోవూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగవరం గ్రామ పొలిమేరలో తమ చేపల చెరువు తూములు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని టీడీపీ నాయకుడు గండవరపు లక్ష్మీనరసారెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమను ఆర్థికంగా నష్టపరచాలనే దురుద్దేశ్యంతో గిట్టని వ్యక్తులు ధ్వంసం చేసి ఉంటారని ఆయన పోలీసుకు వివరించారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సంగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో కార్తీక మాసం తొలి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు.



సాయిబాబాకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట పంచాయతీలోని ద్వారకానగర్‌లో వెలసిన శేషసాయినాథుడి మందిరంలో కార్తీక మాసతొలి ఆదివారపు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్లూరు మండలం గోగులపల్లి, పురిణి, గద్దగగుంట, ఇందుపూరు గ్రామాల భజన బృందాలు చేసిన భజనలతో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా కొండబిట్రగుంట మేకల మనోజ్, కుటుంబసభ్యులు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో మందిర వ్యవస్థాపకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, అయ్యప్ప మాలధారులు, సాయి సేవకులు వెంకారెడ్డి, దాసరి శ్రీనివాసులు, సుభాషిని, సుబ్రమణ్యం ఉన్నారు.

అన్నసంతర్పణ ప్రారంభం

కావలి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక 33వ వార్డు కలుగోళమ్మపేట అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మాలదారులకు అన్నసంతర్పణ ప్రారంభించారు. తొలి రోజు ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలుగా అమరా సోదరులు వ్యవహరించారు. ఆయల కమిటీ బాధ్యులు అమరా వేదగిరి మాట్లాడారు. దాతల సహకారంతో ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా అన్నిరకాల మాల ధారులకు 45 రోజులు అన్నసంతర్పణ చేపడతామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు దుగ్గిశెట్టి నవీన్, మాధవి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అలేఖ్య, శ్రీకాంత్ దంపతులు, బోగోలు తహసీల్దారు మలిశెట్టి సురేష్, మోడరన్ నరసింహారావు, శ్రీహరినాయుడు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధంతో ఎండుతున్న వరిపైరు

● ఆందోళనలో రైతులు


కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


ఎండుతున్న వరిపైరు

ఉదయగిరి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం కావడంతో ఆరుగాలం కష్టించి సాగుచేసిన వరి పంటకు నీటి తడులు అందించలేక కళ్లెదుటే ఎండుముఖం పడుతుండడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో గత 15 రోజుల క్రితం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఉన్న సుమారు 15 ఎకరాల్లో సాగులో ఉన్న వరి చేలకు నీటి తడులు అందించలేక పొలం నెర్రెలుబారింది. వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉందని, మరికొన్ని రోజుల్లో పంట చేతికందుతుందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు సుమారు రూ.25 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటకు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నీటి తడులు అందించలేక పూర్తిగా నష్టపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి ఎండుతున్న వరి పంటను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ప్రాధాన్యత క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు అధికంగా కాలిపోయాయి. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యతా క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తున్నామని ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా తెలిపారు. గండిపాళెం గ్రామానికి సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ అందజేస్తామన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

● ప్రమాదాల బారిన వాహన చోదకులు


కందుకూరు - పామూరు రోడ్డులో ఓ స్కూల్ క్యాంపస్ వద్ద ఇండికేటర్లు లేకుండా ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్

కందుకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాలలో నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారిపై ఇండికేటర్లు లేకుండా ఇష్టారీతిగా ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు-పామూరు, కందుకూరు-గుడ్లూరు, కందుకూరు-కనిగిరి రహదారులలో పలుచోట్ల విద్యాసంస్థల నిర్వాహకులు, పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేశారు. కంకర, తారు మిశ్రమంతో పెద్దపెద్ద స్పీడ్ బ్రేకర్లు ఎవరి ఇష్టానుసారం వారు ఏర్పాటుచేసుకున్నారు. కానీ అవి కనిపించేలా ఎలాంటి ఇండికేటర్లు ఏర్పాటుచేయకుండా వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం స్పీడ్ బ్రేకర్లు రాత్రివేళల్లో సైతం వాహనదారులకు కనిపించేలా తెలుపు రంగు వేసి దాని పై స్పష్టంగా కనిపించే రంగుతో అడ్డంగా పట్టీలు వేయాల్సి ఉండగా ఎక్కడా ఇవి లేవు. దీంతో రాత్రివేళల్లో వేగంగా వచ్చే వాహనాలు స్పీడ్‌బ్రేకర్ల వద్ద ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల కనిగిరి రోడ్డులో ఓ స్పీడ్ బ్రేకరు వద్ద అదుపుతప్పిన ఇనుము లోడు ట్రాక్టరు కొద్ది దూరం వెళ్లి పడిపోగా అదృష్టవశాత్తు డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నందున అవసరం లేనిచోట స్పీడ్ బ్రేకర్లను తొలగించటంతో పాటు అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లకు ఇండికేటర్లు ఏర్పాటుచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం

కందుకూరి చంద్రమౌళి
జలవనరుల శాఖ ఏఈ, ఉదయగిరి



ఉదయగిరి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21, 22, 23వ తేదీల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇప్పటికే సాగు నీటి సంఘాల ఓటర్ల జాబితాను సర్వేనెంబర్ల వారీగా రెవెన్యూ అధికారులకు అందజేశామని, త్వరలో తుది జాబితా ప్రకటిస్తామని జలవనరుల శాఖ ఏఈ కందుకూరి చంద్రమౌళి పేర్కొన్నారు.

ఈ ముఖాముఖి

? : మండలంలో ఎన్ని చెరువులు ఉన్నాయి.

!: 26 చెరువులు, ఒక జలాశయం ఉన్నాయి.

?: ఎన్నింటికి ఎన్నికలు జరగనున్నాయి.

!: మండలంలో 11 చెరువులకు, గండిపాళెం జలాశయం కింద 8 డిస్ట్రిబ్యూటరీలకు కలిసి మొత్తం 19 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి.

?: ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం చేశారా

!: ఆయా చెరువులు, జలాశయం కింద సాగులో ఉన్న భూముల సర్వేనంబర్లను రెవెన్యూ అధికారులకు పంపాం. వారిచ్చే నివేదిక ఆధారంగా ఆయా సర్వేనెంబర్లు ఎవరి సాగులో ఉన్నాయో గుర్తించి తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తాం.

నేడు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

కావలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ ముఫ్త్‌బిజ్లీ యోజన పథకం కింద విద్యుత్ వినియోగదారులు ప్రయోజనాలు పొంది అధిక విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి పొందవచ్చని కావలి విద్యుత్‌శాఖ ఈఈ బెనర్జీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని తుమ్మలపెంటరోడ్డులోని స్పందన ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉదయం దీనిపై వినియోగ దారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొని ఈ పథకంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సదస్సులో పాల్గొని ప్రయోజనం పొందాలన్నారు.



అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు : డీఎం


బస్సుకు పూజలు నిర్వహిస్తున్న కార్మికులు

ఉదయగిరి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో అరుణాచలం బస్సు సర్వీసుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 10, 14, 17, 24వ తేదీల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. ఈ సర్వీసుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, రానుపోను ఒక్కొక్కరికి టిక్కెట్టు ధర రూ.1,650 అని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ వెంకటేశ్వర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి



మాట్లాడుతున్న నేతాజీ సుబ్బారెడ్డి

ఆత్మకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని రాష్ట్ర అపస్మా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో ఆదివారం ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గ ప్రీ ప్రైమరీ టీచర్స్ ట్రెనింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎస్ శ్రీధర్, జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షులు కోటేశ్వరరెడ్డి, వెంకటరత్నం, మాజీ అధ్యక్షులు జి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బిట్రగుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు శ్రీవత్స చెస్ట్, చిల్డ్రన్స్ క్లినిక్ వైద్యులు కల్యాణి, చిరంజీవి తెలిపారు. బోగోలు మేజర్ పంచాయతీలోని షిర్డీ సాయిబాబా మందిర ఆవరణలో స్థానిక సామాజిక కర్త పసుపులేటి శేషయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 128మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు కొర్రా చంద్రశేఖర్, ప్రైవేట్ వైద్యులు ఆనందసాగర్, శశికుమార్‌లతో పాటు వాకర్స్ గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్ యాదవ్, సాయి సేవకులు ఉన్నారు.

● సీతారామపురం: ఎల్వీఆర్ జూనియర్ కళాశాలలో 2002-2004 సంవత్సరంలో ఇంటర్ విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నెల్లూరు ఎనెల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 350 పైగా ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని, ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్, మోకాళ్ల నొప్పులు, కీళ్లనొప్పులు, గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఎనెల్ హాస్పిటల్ డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ యాదవ్ కులారి తెలిపారు.



కార్తీకమాస పూజలపై ప్రచారం

లింగసముద్రం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పూజలు, దీపాలు వెలిగించడం వలన కలిగే లాభాలను త్రైత సిద్ధాంత సేవాసమితి, ఇందుజ్ఞానవేదిక దుత్తలూరి కమిటీ అధ్యక్షులు ప్రసాద్ తెలిపారు. ఆదివారం మొగిలిచెర్ల, నారసింహాపురం, తాతాహోటల్, జంపాలవారిపాలెంలో ఆయన సమితి సభ్యులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు సుధాకర్, నరసింహులు, నాగమ్మ, వెంకటసుబ్బమ్మ, రమణమ్మ, రమ్యశ్రీ, ప్రేమ్‌కుమార్, కొండారెడ్డి, కొండారెడ్డి, ధనమ్మ, కోటేశ్వరమ్మ, మమత పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

అల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని చెర్లో సంఘంలో తిరంశెట్టి సంజీవయ్య, మండలంలోని బట్రకాగొల్లులో యద్దల శేఖర్‌లు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న అల్లూరు కెఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం అంత్యక్రియల నిమిత్తం వారి కుటుంబసభ్యులకు రూ.3వేలు అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి ఈ ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు.



చిన్నారులతో పుస్తక పఠనం


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఉలవపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలపై విద్యార్థులకు మక్కువ పెరగాలనే తలంపుతో ప్రవేశపెట్టిన చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించినట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులతో నీతికథలు, జాతీయ నాయకుల జీవితచరిత్రలు పఠనం చేయించారు. ఉలవపాడు అనుబంధశాఖ చాకిచర్ల గ్రంథాలయంలో కూడా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు.

యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

కందుకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా దామా కొండపనాయుడు, చిత్తారి వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన యూటీఎఫ్ ప్రాంతీయ సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



న్యూస్ బాక్స్

భర్త వేధింపులతో వివాహిత బలవన్మరణం

నెల్లూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెళ్లై రెండేళ్లయినా పిల్లలు పుట్టడంలేదన్న కారణంగా భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. నెల్లూరురూరల్ సీఐ జీ వేణు అందించిన వివరాల మేరకు.... నెల్లూరు రూరల్‌లోని అల్లీపురం వద్దనున్న వేమారెడ్డి నగర్‌లో యాచ్చేంద్ర, రాగాల తేజశ్విక (20) దంపతులు నివసిస్తున్నారు. వీరిద్దరు వివాహం చేసుకుని రెండేళ్లు పూర్తయింది. పిల్లలు పుట్టడం లేదన్న కారణంతో యాచ్చేంద్రకుమార్ తరుచూ తేజశ్వికను వేధించేవాడు. అవికాస్త ఎక్కువ అవడంతో భరించలేక తేజశ్విక ఆదివారం ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నేడు కార్తీక సోమవారం పూజలు

కోవూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తీక మాసంలోని మొదటి సోమవారం పూజలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ పాలక మండలి ఏర్పాట్లను పూర్తి చేసింది. ఉదయం నుంచే పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. కార్తీకమాస ప్రారంభం కావడంతో ఆదివారం రాత్రి పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి శివనామాన్ని జపించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ పూజారి విశ్వనాథం సుబ్బరామయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

విడవలూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వావిళ్లలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు జరిగింది. ఈ గ్రామంలో రెండు రోజుల్లోనే 700 మంది సభ్యత్వం తీసుకున్నట్లు మాజీ ఎంపీటీసీ ఏటూరు హరిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమలు పరుస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు అకర్షితులైన యువతి, యువకులు, అనేక మంది పార్టీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి 5లక్షల బీమా సౌకర్యంతో పాటు, పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమీర్‌జాన్‌కి 'విపంచి' పురస్కారం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో జరిగిన విపంచి చిత్రకళా పోటీల్లో నెల్లూరుకు చెందిన అమీర్‌జాన్‌కి పురస్కారం లభించింది. ఆదివారం సాయంత్రం ఈ పోటీలను ఒంగోలు సృష్టి అకాడమీ, కళాయజ్ఞ సంస్థలు నిర్వహించాయి. అమీర్‌జాన్ చిత్రించిన బెనారస్ చిత్రానికి పురస్కారం, నగదు బహుమతి లభించాయి.

మహిళలకు సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గృహిణుల దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలను 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి, జ్యోతి దంపతులు ఆదివారం ఘనంగా సత్కరించారు. బాలాజీనగర్ వికాస్ హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పీ వలిపద్మావతి, డీ సుగుణమ్మ, టీ శ్రీలత, ఎం రాజేశ్వరి, ఎం కవిత, వీ లక్ష్మీ, కే ఆదిలక్ష్మీ, రజనీ, ఎం మాధవీ సన్మానం అందుకున్నారు.

భారీ వర్షం వస్తే జలదిగ్బంధమే..!



తిరుమలమ్మపాళెం సమీపంలోని లో లెవెల్ వంతెన

- కండలేరు క్రీక్‌పై కలగా మిగిలిన హై లెవెల్ వంతెన!
- వర్షాలు కురిస్తే రెండు గ్రామాలు నీట మునక
- దీవిని తలపిస్తున్న తిరుమలమ్మపాళెం
- అవస్థలు పడుతున్న ప్రజలు

వెంకటాచలం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి విసిరేటసినట్లు చివరన ఉన్న పంచాయతీ తిరుమలమ్మపాళెం. ఈ పంచాయతీ పరిధిలో తిరుమలమ్మపాళెం, గాజులపల్లి కోనేరు గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు ఉత్తర, దక్షణ, తూర్పు దిక్కుల్లో కండలేరు క్రీక్ కాలువ ఉంది. ఆయా గ్రామా లకు చేరాలంటే ఉత్తర దిక్కున ఉన్న కండ లేరు క్రీక్ కాలువపై ఉన్న లో లెవెల్ వంతె నను దాటాలి. అయితే భారీ వర్షాలు పడితే ఈ వంతెనపై సుమారు 6 అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. దీనికి తోడు గ్రామాలకు మూడు దిక్కులు కండలేరు క్రీక్ కాలువ.. పడ మర దిక్కున కొంతభాగం పొలాలు.. మిగిలిన భాగం అడవి ఉంది. దీంతో ఈ గ్రామం చిన్న దీవిలా మారుతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని ఎన్నికల సమయంలో నేత లు తాను గెలిస్తే గ్రామానికి హై లెవె ల్ వంతెన నిర్మిస్తానని హామీ ఇస్తా రు. ఎన్నికలు ముగియగానే నేతలు ఒట్టు తీసి గట్టుపై పెట్టేస్తారు. దీంతో ప్రతి ఏటా వర్షాకాలంలో ఈ రెండు గ్రామాల ప్రజలు ఒక్కో వారం రోజుల పాటు జలదిగ్బంధంలో ఉండి పోతుంటారు. తాగు నీటికి సైతం వీరు అల్లాడిపోతుంటారు. గత ఏడాది కురిసిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా ఏకంగా 10 రోజు లపాటు ఈ గ్రామాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అధికారులు ఆ రోజుల్లో వారి రాకపోకల కోసం నామమాత్రంగా ఒక పడవను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుం టున్నారే తప్ప వారికి శాశ్వత పరిష్కారం చూపా లన్న ఆలోచన రావడం లేదు. భారీ వర్షాలు, వర దల సమయాల్లో గ్రామంలోని మూగజీవాల దుస్థితి చెప్పనక్కర్లేదు. తమకే ఆహా రం దొరక్క అవస్థలు పడే ప్రజలు తమ పశువుల విషయంలో నిస్సహాయులుగా ఉండిపోతారు. అదేవిధంగా ఈ గ్రామానికి దక్షణం దిక్కున ఉండే కాలువ నీటితో రైతులు రొయ్యలు సాగు చేస్తున్నారు. భారీ వర్షాల సమయంలో లో లెవెల్ వంతెన మునిగిపోతుం డడంతో రొయ్యల రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు.

హామీ అమలు కాలేదు



కలగా ఉన్న తిరుమలమ్మ పాళెం హై లెవెల్ వంతెన నిర్మా ణంకు గతంలో జరిగిన అనేక సార్వత్రిక ఎన్నికల సమయాల్లో నూ తమ గ్రామానికి హైలెవల్ వంతెన మంజూరు చేయిస్తామ ని నేతలు హామీలు ఇచ్చారు. కానీ ఎన్నికలు ముగియగానే మాకిచ్చిన హామీలను వారు విస్మరిస్తున్నారు. మా రెండు గ్రామాల ప్రజలకు ప్రతి ఏటా తిప్పలు తప్పడం లేదు. దీంతో మా గ్రామంలోని యువతీ, యువకులకు వివాహ సంబంధాలు కూడా సరిగా రావడం లేదు. ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని హై లెవెల్ వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నాం.

- పాముల పోలయ్య (తిరుమలమ్మపాళెం గ్రామం)

● మాట నిలబెట్టుకొనేవారేరీ?

గతంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఒకసారి మంత్రిగా పని చేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట ఇచ్చారే తప్ప ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపో యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత రెండేళ్ల కిందట దామోదరం సంజీవయ్య పవర్ ప్లాంటుకు వచ్చిన సమయంలో సాక్షాత్తు ఆనాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.11 కోట్లతో హైలెవెల్ వంతెన నిర్మిస్తామని మాట ఇచ్చారని, ఆ తర్వాత అనేకసార్లు వంతెన నిర్మాణం చేస్తున్నట్లు, సర్వే కూడా జరగబోతున్నట్లు మాజీ మంత్రి కాకాణి మాటలు చెప్పారే కానీ చివరకు హామీని నిలబెట్టుకోలేకపోయారని గ్రామస్థులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడం, సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపొందడంతో తమ ఆశలు చిగురించాయని ఆ రెండు గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

అందరి సమన్వయంతో జిల్లా అభివృద్ధి

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్

నెల్లూరు(సిటీ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఆదివారం నెల్లూరుకు వచ్చిన ఆయన టీడీపీ జిల్లా కార్యాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి ఆనంతో కలిసి మీడియాతో మాట్లాడారు. జిల్లాలో సాగునీటి వినియోగానికి లెక్క ఉండాలన్నారు. నీటి వృథాను అరికడితే ఎంతో మేలు జరుగుతుందన్నారు. కృష్ణపట్నం పోర్టును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. జనసేన, బీజేపీతో కలిసి పని చేస్తామని, అందరి సలహాలు తీసుకుని ప్రజలకు సంక్షేమ ఫలాలు అందచేస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలోవలే జిల్లాలోనూ మూడు పార్టీల ఫార్ములాను అమలు చేస్తామని, టీడీపీతోపాటు బీజేపీ, జనసేన పార్టీలకు సమన్వయకర్తల ఎంపిక అవసరముందన్నారు. ఐదు మంది సభ్యులతో కూడిన మానిటరింగ్ కమిటీ రాష్ట్రంలో పని చేస్తోందని, దాని నిర్ణయాల మేరకు జిల్లాలోనూ సమన్వయంతో ముందుకు వెళ్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అజీజ్, టిడ్కో చైర్మన్ అజయ్, సర్వేపల్లి, కావలి, కందుకూరు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దగుమాటి కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ కార్యకర్తల దాడి

● ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన టీడీపీకి చెందిన యువకులు

ఇందుకూరుపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట దళితవాడలో ఇద్దరు టీడీపీ సానుభూతిపరులపై ఆదివా రం రాత్రి వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. దళితవాడకు చెందిన జొన్నవాడ అవినాష్, బొచ్చు వంశీలు క్యారంబోర్డు ఆడుకుంటుండగా వైసీపీ కార్యకర్తలు చలం రాహుల్, ఈదూ రు చిన్న, చలం మురళి, చలం మహేష్, చలం వెంకటేష్(జగదేవిపేట సచివాలయం ఇంజనీరింగ్ ఉద్యోగి) కత్తులు, రోడ్లతో వారిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దాడికి పాల్పడిన వారిపై హత్యా యత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. కాగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పని చేశామన్న కోపంతో తమపై దాడి చేశారని బాధితులు వాపోయారు. ఆ ఎన్నికల సమయంలో తెలుగు దేశం పార్టీ అభ్యర్థుల కరపత్రాలను సచివాలయ ఇంజనీరింగ్ ఉద్యోగి చలం వెంకటేష్ తగులపెట్టిన ఘటనలు ఉన్నాయని బాధితులు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ కిశోర్
- ఏపీఎఫ్‌డీసీ లేబర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన అటవీ అభివృద్ధి కార్పొరేషన్ లేబర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ

నెల్లూరు (వైద్యం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుమల్లి శంకర్ కిశోర్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో అటవీ అభివృద్ధి కార్పొరేషన్ లేబర్ ఎంప్లాయీస్ యూనియన్ కార్మికుల రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం జరిగింది. కిశోర్ మాట్లాడుతూ యూనియన్‌లో ఉన్న సమస్యలను కార్మికులే పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే జీతభత్యాలు, ఈఎస్ఐ సౌకర్యం వంటి సమస్యలపై పోరాడాల్సి ఉందని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా శంకర్ కిశోర్, అధ్యక్షుడిగా దామా అంకయ్య, ప్రధాన కార్యదర్శిగా బక్కముంతల సుధాకర్, కోశాధికారిగా బత్తల గురుమూర్తి, ఉపాధ్యక్షులుగా మండ్ల వెంకటేశ్వర్లు, శిగిరెడ్డి కిరణ్‌బాబు, ఉప కార్యదర్శులు గంగిరెడ్డి సురేష్, చల్లా వేమాలయ్య, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా వెంకటేష్, షంషీర్, కిరణ్, సతీష్, నాగ దుర్గారావు, సుబ్బారావు, ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నేత రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రిజర్వాయర్‌లో 4 టీఎంసీల నీటి నిల్వకు కృషి

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కనిగిరి రిజర్వాయర్ నుంచి సదరన్‌చానల్‌కు నీటిని విడుదల చేస్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్‌లో 4 టీఎంసీల నీటి నిల్వకు కృషి చేస్తానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నీటి పారుదలశాఖ అధికారులు, కూటమి నాయకులతో కలిసి సదరన్(దక్షిణ), ఈస్ట్రన్(తూర్పు) కాలువల్లో క్రస్ట్ గేట్లు ఎత్తి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుసంఘాల సూచనల మేరకు నీటి సామర్థ్యం కోల్పోయిన రిజర్వాయర్ పూడికతీత లేదా కరకట్టలు ఎత్తు పెంచి సామర్థ్యం పెంపునకు చర్యలు చేపడతామన్నారు. నారుమళ్ల కోసం ఈస్ట్రన్ ఛానల్‌కు 100 క్యూసెక్కులు, సదరన్‌ఛానల్‌కు 80 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు. ముందుగా సదరన్, ఈస్ట్రన్ ఛానల్స్ వద్ద గంగమ్మకు పూజలు నిర్వహించి చీర, సారె సమర్పించారు. కాగా రామకృష్ణానగర్‌కు చెందిన ఓ మహిళ తనపై జరుగుతున్న వేధింపులపై పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. అలాగే కోట్ల విలువ చేసే గ్రావెల్ ఎత్తేసిన వవ్వేరుకు చెందిన ఓ వ్యక్తిపై చర్యలు చేపట్టాలని కోరాడు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ నాగరాజు, డీఈఈ పెంచలయ్య, రిజిర్వాయర్ ఏఈ ప్రసాద్, కోవూరు సెక్షన్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీహరి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు హరికృష్ణ, గోవర్దన్‌రెడ్డి, శివామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు ప్రారంభం

కొడవలూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా కొడవలూరు రైల్వేగేటు సమీపంలో రహదారిపై ప్యాచ్ వర్కులను ఆదివారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. గత ప్రభుత్వంలో కొత్త రోడ్లు వేయకపోగా గుంతల పడ్డ రోడ్లకు తట్టడు మట్టి వేయలేదన్నారు. కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో గ్రామీణాప్రాంతాల రోడ్లుకు మహర్దశ పట్టిందన్నారు. నియోజకవర్గంలో సూమారు 62 కి.మీ గుంతల రోడ్లు ఉన్నాయని గుర్తించామన్నారు. వీటి మరమ్మతులకు ప్రభుత్వం కోటి రుపాయలు విడుదల చేసిందన్నారు. నియోజకవర్గ అబివృద్ధికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.49 కోట్లు సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, జీవీఎన్ శేఖర్‌రెడ్డి, కరకటి మల్లికార్జున, మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, పాటూరి రమేష్, తువ్వర ప్రవీణ్ పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేకి అభినందనలు

టీటీడీ పాలక మండలి సభ్యురాలిగా ఎంపికైన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని టీడీపీ నాయకులు నాసిన ప్రసాద్, తువ్వర ప్రవీణ్‌లు ఆదివారం నెల్లూరు నగరంలో ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఎన్టీఆర్ పార్కు ప్రారంభం



పార్కు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మినీ బైపాస్ రోడ్డు వెంబడి అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న ఎన్టీఆర్ పార్కును రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ.2 కోట్లతో పార్కును ఆధునీకరించినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో అన్నీ హంగులతో ఈ పార్కును తీర్చిదిద్దారని, కానీ వైసీపీ పాలనలో ఇది ప్రారంభానికి నోచుకోలేదన్నారు. దానిని తిరిగి టీడీపీ ప్రభుత్వంలోనే ప్రజలకు అంకితం చేశామన్నారు. ప్రజల ఆహ్లాదానికి, కాసేపు సేదతీరడానికి పార్కు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ జ్యోతిప్రియ, నాయకులు మదన్‌కుమార్‌రెడ్డి, జెన్నీ రమణయ్య, మురళీ పాల్గొన్నారు.

● పార్టీలో చేరిక

నెల్లూరు రూరల్ నియోజకవర్గం వావిలేటిపాడులో వైసీపీకి చెందిన గున్నం చంద్రమౌళి, మోచర్ల మోహన్, కొల్లపూడి నాగరాజు, కుండా రమేష్ వారి మిత్ర బృందం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఇన్‌చార్జి మంత్రితో టిడ్కో చైర్మన్ భేటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరానికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మైనారిటీ, న్యాయ శాఖ మంత్రి మొహమ్మద్ ఫరూక్‌తో రాష్ట్ర టిడ్కో చైర్మన్, జనసేన పార్టీ నేత వేములపాటి అజయ్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, సుందర్‌రామిరెడ్డి, గునుకుల కిషోర్, సుజయ్‌బాబు, కృష్ణారెడ్డి, రవి, గుర్రం కిషోర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మంత్రి ఫరూక్‌ను ఆదివారం రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో ఎస్పీ జీ కృష్ణకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు చెందిన పలు విషయాలపై చర్చించుకున్నారు.

మంత్రి నాదెండ్లతో సుజయ్...

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆదివారం జనసేన పార్టీ నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు రేణిగుంట విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ నాయకుడు చప్పిడి శ్రీనివాసు లురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వేమిరెడ్డి బ్యాటరీ ట్రైసైకిల్ వితరణ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 3 : ఉదయగిరి మండలంలోని సంజీవరావుపల్లి గంగుల చెరువు గ్రామానికి చెందిన బడబాగ్ని కేశవరాజు అనే దివ్యాంగుడికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ అందచేశారు. కేశవరాజు ప్రమాదంలో ఒక కాలు కోల్పోయాడు. ఊత కర్రల సహాయంతో సరిగా నడవలేక పోయేవాడు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ట్రైసైకిల్ ఇస్తారని తెలిసి వేమిరెడ్డి దంపతులను కలిశాడు. వెంటనే స్పందించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేశవరాజుకు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ట్రైసైకిల్ అందచేశారు.



ట్రైసైకిల్ అందుకున్న దివ్యాంగుడితో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నెల్లూరు (వైద్యం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలోని పలుచోట్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. 14, 15, 16, 29 డివిజన్లలో నాయకులు డీవైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి నరసింహ, నగర కార్యదర్శి రమణ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ 1980లో పంజాబ్‌లో ఆవిర్భవించిన డీవైఎఫ్ఐ అనతికాలంలోనే దేశంలో అతిపెద్ద యువజన సంఘంగా ఎదిగిందన్నారు. ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు, సేవా కార్యక్రమాలు చేసిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిరుద్యోగిత పెరుగుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు నాగేశ్వరరావు, కాయం శ్రీనివాసులు, సూర్యనారాయణ, అల్లంపాటి శ్రీనివాసులు, షేక్ జాఫర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్య నాటకాలను కాపాడుకోవాలి

● 25 కళాసంఘాల గౌరవాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అంతరించి పోతున్న పద్య నాటకాలను, సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని 25 కళాసంఘాల గౌరవాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ వైద్యశాల సెల్లార్‌లో సింహపురి పద్య నాటక కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కళాకారులకు గుర్తింపుకార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కళాకారుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింహపురి పద్యనాటక కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర్లు(భద్రాచలం బాబు), ప్రధాన కార్యదర్శి వీ చక్రపాణి, కోశాధికారి కొమ్మిరెడ్డి హరనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చెంచురామయ్య, సంయుక్త కార్యదర్శులు దండి సురేష్, ఉడతా ప్రభాకర్, కసుమూరు మస్తాన య్య, జిల్లా గౌరవాధ్యక్షుడు షేక్ ఖాజామస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమరావతి కృష్ణారెడ్డి

రూరల్ అభివృద్ధికి సహకరించండి

● ఇన్‌చార్జి మంత్రికి టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి వినతి

నెల్లూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫారూక్‌ను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కోరారు. నెల్లూరుకు వచ్చిన మంత్రిని ప్రభుత్వ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్‌లోని పలు ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో నగరంతోపాటు పల్లె ప్రాంతం కలిసి ఉందని, శివారునున్న ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందని తెలిపారు. అనంతరం పలు సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు అందచేశారు.



ఇన్‌చార్జి మంత్రి ఫరూక్‌ని సత్కరిస్తున్న గిరిధర్‌రెడ్డి





గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రాథమిక విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. జీవో 117 తీసుకొచ్చి ఉన్నత పాఠశాలలతో పలు ప్రాథమిక పాఠశాలలను విలీనం చేసింది. ఈ నిర్ణయం.. విద్యార్థులకు శాపంగా మారింది. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులను అవస్థలకు గురిచేసింది. ఇలా ప్రాథమిక విద్యను గాడి తప్పేలా చేసిన విలీనం జీవోను రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. దీంతో ప్రాథమిక పాఠశాలలకు మళ్లీ మంచి రోజులు రానున్నాయి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

ప్రాథమిక విద్యకు మళ్లీ మంచి రోజులు!

- 117 జీవో రద్దు నిర్ణయంతో మళ్లీ తెరచుకోనున్న 814 ప్రాథమిక పాఠశాలలు
- గ్రామీణ విద్యార్థులకు తప్పనున్న ఇబ్బందులు

అభినందనీయం



జీవో 117ను రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయం. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ జీవో కారణంగా ప్రభుత్వ విద్యారంగం అతలాకుతలమైంది. విద్యాప్రమాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉపాధ్యాయులూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

- ఎస్.బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టు

117 జీవో ప్రాథమిక విద్యకు గొడ్డలి పెట్టులాంటిది. దాని వల్ల ప్రాథమిక విద్య అస్తవ్యస్తమైంది. తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషం. గత ప్రభుత్వం తరహాలో ఏకపక్షంగా కాకుండా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి నిర్ణయాలు చేయడం హర్షణీయం.



- బండి మధుసూదన్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

నూతన విద్యావిధానం 2020ని ఆసరా చేసుకుని కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టుకునే లక్ష్యంతో 25కు పైగా రాష్ట్రాలు పక్కన పడేసిన విద్యా విధానాన్ని గత వైసీపీ ప్రభుత్వం 117 జీవో రూపంలో తీసుకొచ్చింది. దీని ప్రకారం హైస్కూల్‌కు మూడు కిలోమీటర్లలోపు దూరమున్న ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయాలి. కానీ ఉమ్మడి జిల్లాలో ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న 814 పాఠశాలలను 430 ఉన్నత పాఠశాలల్లో మూడు విడతల్లో విలీనం చేశారు. ఆ లెక్కన 814 బడులు మూతపడ్డాయి. ఇక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 98 కంటే తక్కువగా ఉంటే స్కూల్ అసిస్టెంట్ పోస్టు లేకుండా చేసింది. 6 నుంచి 10వ తరగతి వరకున్న ఉన్నత పాఠశాలల్లో 93 మందికన్నా తక్కువ విద్యార్థులున్నచోట, అలాగే 3 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఉన్నత పాఠశాలల్లో 137 కంటే తక్కువ విద్యార్థులు ఉన్నచోట గ్రేడ్-2 హెడ్‌మాస్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను తీసేసింది. దీంతో హెచ్‌ఎం లేని పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడి విద్యాబోధన గాడితప్పింది. ఇలా అసంబద్ధ సర్దుబాట్లతో వేలాది ఉపాధ్యాయ పోస్టులను మిగులు చూపించింది. మరోవైపు మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులు సుమారు 2,500మంది ఉన్నత పాఠశాలలకు తరలివెళ్లి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలా ఇబ్బందులకు గురిచేసిన ఈ జీవో పూర్తిగా రద్దయితే విలీనంతో మూతపడిన ప్రాథమిక పాఠశాలలు మళ్లీ తెరచుకోనున్నాయి. గ్రామీణ పిల్లలకు విద్య అందడంతోపాటు.. ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడతాయి. భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ మరోసారి ఇచ్చే అవకాశముంది.

నష్టాలెన్నెన్నో..

- జీవో 117 ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లోని 3 నుంచి 5 తరగతులను మూడు కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు దూరాభారం పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఇక్కట్ల పాలయ్యారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ఎవరి తోడూ లేకుండా వెళ్లిపోయే విద్యార్థులను ఇప్పుడు తల్లిదండ్రులు తీసుకెళ్లాల్సి వచ్చింది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదివే ఇద్దరు పిల్లలు ఉంటే వారిని పాఠశాలల్లో వదిలి, తీసుకురావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తద్వారా డ్రాపౌట్స్ పెరగడంతో ప్రైవేటు పాఠశాలలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచుకున్నాయి.
- 3, 4, 5 తరగతులను తరలించడం వల్ల అనేకం సింగిల్ టీచర్ పాఠశాలలుగా మారిపోయాయి. అనారోగ్యం తదితర కారణాలతో ఉన్న ఒక్క టీచర్ సెలవు పెడితే ఇక ఆ పాఠశాల జరగని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదులు నిరుపయోగంగా మారిపోతే విలీనం కారణంగా వచ్చిన విద్యార్థులు ఉన్నత పాఠశాలల్లో తరగతి గదులు లేక ఇబ్బందులు పడ్డారు. పైగా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిలో తేడాలు రావడంతో పర్యవేక్షణ కొరవడింది.
- ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 98 కంటే తక్కువగా ఉంటే స్కూల్ అసిస్టెంట్ పోస్టు లేకుండా చేశారు. దీంతో ఎస్జీటీలతోనే బోధన సాగించాల్సిన పరిస్థితి. అయితే ఎస్జీటీలు 6, 7, 8 తరగతులకు ఆంగ్లం, గణితం, సైన్స్ బోధించలేకపోవడంతో విద్యార్థులు వెనుకబడిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలా 3వ తరగతి విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్లతో బోధన అంటూ ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్‌ను లేకుండా చేశారు.

ఉపాధ్యాయులకూ తప్పని సమస్యలు

జీవో కారణంగా ఉపాధ్యాయులకు పనిభారం బాగా పెరిగింది. గతంలో ఉపాధ్యాయులకు వారానికి కనిష్ఠంగా 24 పిరియడ్లు, గరిష్ఠంగా 30 పిరియడ్లు ఉండేవి. జీవో తర్వాత ప్రతి ఉపాధ్యాయుడికీ 35 నుంచి 45 పిరియడ్లు వచ్చాయి. దీనివల్ల బోధనా నాణ్యత పడిపోయింది. రెమిడియల్ క్లాసులు నిర్వహించలేకపోవడంతో విద్యలో కాస్తంత బలహీనంగా ఉండే విద్యార్థులకు నష్టం వాటిల్లింది. అలాగే మూల్యాంకనం, సంసిద్ధతకు సమయం కొరవడింది. 30 లోపు విద్యార్థులకు ఒక సెకండరీ గ్రేడ్ టీచర్ చొప్పున కేటాయిస్తామన్నారుగాని 31కి పైగా ఉన్నచోట రెండో పోస్టు ఇవ్వలేదు. తరగతుల విలీనం వల్ల ఉపాధ్యాయులు తామున్న ప్రాంతాల నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు 3, 4, 5 తరగతుల విద్యార్థులకు వారి స్థాయికి దిగి బోధించలేకపోయారు. దీంతో విలీనమైన 3 నుంచి 5 తరగతుల విద్యార్థుల సామర్థ్యం తగ్గుముఖం పట్టింది.

ముక్కంటి ఆలయ ఈవోగా బాపిరెడ్డి బాధ్యతల స్వీకరణ



శ్రీకాళహస్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా బాపిరెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఈయన్ను ముక్కంటి ఆలయ ఈవోగా ఫారిన్ డిప్యుటేషన్ ప్రాతిపాదికన రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో ఆయన స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నాక, ఆలయ పరిపాలన భవనంలో బాధ్యతలను స్వీకరించారు. అనంతరం అధికారులు ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ప్రధాన అర్చకుడు కరుణాకర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈవో బాపిరెడ్డి ఆలయంలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ప్రసాదాల కౌంటర్‌లో పరిస్థితిపై ఆరా తీశారు. భక్తులకు వేగవంతంగా ప్రసాదాలు సరఫరా చేసేలా సూచనలు చేశారు. అన్నదాన మండపంలో సాధారణ భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నాణ్యత లోపించకుండా ఎప్పటికపుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

అసోం జైలు నుంచి పరారైన ఖైదీ అరెస్టు

- పోక్సో కేసులో ముద్దాయిగా పోలీసుల గుర్తింపు

తడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అసోం జైలు నుంచి పరారైన ఖైదీ జీయాలున్ ఇస్లాంను శనివారం అర్ధరాత్రి తడ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. అసోం రాష్ట్రం మారేగాన్ జిల్లాకు చెందిన మహ్మద్ జీయాలున్ ఓ అత్యాచారం కేసుకు సంబంధించి అక్కడి జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. జైలు అధికారుల కన్నుగప్పి అక్టోబరు 11వ తేది మరో ఖైదీతో కలిసి ఇతడు పరారయ్యాడు. అప్పటి నుంచి అక్కడి పోలీసులు ఈ ఖైదీల కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో జీయాలున్ ఇస్లాం తడ మండలం మాంబట్టు సెజ్‌లో తల దాచుకున్నట్లుగా అక్కడి పోలీసులకు సమాచారం అందింది. దీనిపై తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడికి ఆ జిల్లా ఎస్పీ హేమంత్‌కుమార్ సమాచారం అందించారు. ఆయన సూళ్లూరుపేట పోలీసులను అప్రమత్తం చేశారు. తడ మండలం మాంబట్టు సెజ్‌లోని ఓ ఇంట్లో ఇస్లాం ఉండగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మ నాయుడు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో అదుపులోకి తీసుకున్నారు. మాంబట్టులోని స్నేహితుడి వద్ద తల దాచుకున్నట్లుగా విచారణలో తేలింది. వెంటనే అసోం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారికి అప్పగించనున్నారు.



పోలీసుల అదుపులో ఉన్న జీయాలున్ ఇస్లాం

ఉమ్మడి జిల్లాకు 9000 సీసీ కెమెరాలు

- పోలీసు అధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి అనిత



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన పోలీసు వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర హోం మంత్రి అనిత తెలిపారు. ఈ క్రమంలో చిత్తూరు జిల్లాకు 3 వేలు, తిరుపతి జిల్లాకు 6 వేలు చొప్పున తొమ్మిది వేల సీసీ కెమెరాల సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి సబ్ డివిజన్‌కు ఒక డ్రోన్ అందజేస్తామన్నారు. ఇలా 25 సాధారణ, నైట్ విజన్ కెమెరాలున్న డ్రోన్లను అందించడానికి ఆలోచిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి నగరం శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో ఆదివారం ఐజీ శ్రీధర్, డీఐజీ షిమోషి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలు సుబ్బరాయుడు, మణికంఠ చందోలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో మంత్రి దాదాపు 3.30 గంటల పాటు సమావేశమయ్యారు. స్మార్ట్ పోలీసు వ్యవస్థ రూపకల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎక్కడా గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ జరగకుండా చూడడానికి అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. చిన్నారులపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడే వారికి అదే రోజు ఆఖరి రోజు కావాలన్నారు. సోషల్ మీడియాలో అశ్లీల చిత్రాల కట్టడికి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. సైబర్ క్రైం పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. నేరాల కట్టడి, స్మగ్లింగ్‌ను అరికట్టడం, పోలీసు వ్యవస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు తీసుకున్నారు. జిల్లాలో ప్రొటోకాల్, శాంతి భద్రతలు, నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలపై ఎస్పీ సుబ్బరాయుడును మంత్రి అనిత ప్రశంసించారు. తప్పు చేసిన అధికారుల పట్ల కఠినంగా ఉండారనడానికి నాలుగు నెలల్లో తీసుకున్న చర్యలే నిదర్శనమని ఆమె ప్రస్తావించారు. అనంతరం మంత్రి తిరుమలకు బయలుదేరి వెళ్లారు. సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

గంజాయి, మద్యం మత్తులో బరితెగింపు

- అయిన వారితోనే పొంచి ఉన్న ముప్పు
- హోం మంత్రి అనిత ఆవేదన

పుత్తూరు అర్బన్/వడమాలపేట/రేణిగుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం, గంజాయి మత్తులో మానవ మృగాలు బరితెగిస్తున్నారంటూ హోం మంత్రి అనిత అన్నారు. అయిన వారి నుంచే మహిళలకు, చిన్నారులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారి నుంచి ఎలా రక్షించుకోవాలో తెలియడం లేదని ఆందోళన చెందారు. వడమాలపేట మండలంలో చిన్నారి హత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. ఆమె తల్లిదండ్రులను ఆదివారం మంత్రి పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.పది లక్షల చెక్కు అందజేశారు. నిందితుడికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. చిత్రపటంలో ఆ చిన్నారి చిరునవ్వును చూసి నివాళులర్పిస్తున్న సమయంలో మనస్సులో క్షమించమని కోరానన్నారు. బాధ్యతాయుతమైన పోస్టులో ఉన్న నాకు ఇటువంటి సంఘటన బాధించిందన్నారు. ఈ కేసును స్పెషల్ కోర్టుకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో జరిగిన అఘాయిత్యాలలో నిందితుల్ని 24 గంటల్లో అదుపులోకి తీసుకుని శిక్షలు పడేలా చర్యలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలో అనేక హత్యాచారాలు జరిగినా రాని వారందరూ.. నేడు వచ్చి రాజకీయ లబ్ధి కోసం పాకులాడడం సరికాదని హితవు పలికారు. ఇలాంటి ఘటనలపై రాజకీయాలు మాట్లాడటం పట్ల దేవుడు క్షమించరన్నారు. గత ఐదేళ్లలో పోలీసు వ్యవస్థను వైసీపీ నిర్వీర్యం చేసిందన్నారు. క్రైం రికార్డు చూస్తే గత ఐదేళ్లలో ఎన్నో ఘటనలు జరిగాయన్నారు. తమ ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడుతోదన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపామని, నార్కోటిక్ వింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బెల్టు షాపుల విషయంలో సీఎం చంద్రబాబు చాలా సీరియస్‌గా ఉన్నారన్నారు. మంత్రితో పాటు చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీనివాసులు, ఆర్డీవో రామ్మోహన్, టీడీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య నేతలు చినబాబు, అరుణ, ధనంజయులు నాయుడు, లక్ష్మీప్రసన్న, లోకరాజు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రేణిగుంట విమానాశ్రయంలోనూ హోం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు.



మీడియాతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత


ఆ మానవ మృగాన్ని ఉరి తీయాలి

- ఎస్వీయూలో గళమెత్తిన విద్యార్థినులు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల చిన్నారిని హత్యాచారం చేసిన సుశాంత్‌ను ఉరి తీయాలని ఎస్వీయూనివర్సిటీలో విద్యార్థినులు గళమెత్తారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఉమెన్ హాస్టల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళలపై సాగుతున్న ఈ తరహా హింసపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఏఐఎస్ఎఫ్ నేత చిన్నా కోరారు. ఎక్స్‌గ్రేషియాతో సరిపెట్టుకోకుండా, నిందితులకు కఠిన శిక్ష వేయడం ద్వారా భవిష్యత్తులో అత్యాచారాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాయకులు చంద్రానాయక్, శ్రావణి, వనిత, మౌనిక, వాణిశ్రీ, ఇక్బాల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి చిత్రకారుడికి ప్రథమ బహుమతి





ముక్తేశ్వర్ ఆలయ చిత్రం వేసిన చిత్రకారుడు చిరంజీవిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలులో ఆదివారం జరిగిన ఆర్ట్ ఫెస్ట్‌లో తిరుపతి చిత్రకారుడు చిరంజీవికి ప్రథమ బహుమతి దక్కింది. పెయింటింగ్‌లో జాతీయ స్థాయి అవార్డులు, ప్రపంచ రికార్డులు సాధించిన రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వంద మంది ప్రముఖ ఆర్టిస్టులు ఆర్ట్ ఫెస్ట్‌లో పాల్గొన్నట్టు నిర్వాహకుడు శేషబ్రహ్మం తెలిపారు. 'ప్రాచీన భారత్' అంశం మీద చిత్రకారులు కాన్వాస్ పెయింటింగ్స్ ప్రదర్శన చేశారు. అందులో ముక్తేశ్వర్ ఆలయ పెయింటింగ్‌కు గాను తిరుపతి చిత్రకారుడు చిరంజీవికి ప్రథమ బహుమతి వచ్చిందని, అందుకుగాను రూ10,116 నగదు బహుమతి, చిత్రకళా భారతి పురస్కారాన్ని అందజేసినట్టు చెప్పారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం




శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా 1,849మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,171మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,529మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 919, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 286మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 228మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 68మంది భక్తులు దోషనివారణ పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 18,673 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

నటించిన ప్రతి పాత్రకూ ప్రాణం పోయడం ఆయన ప్రత్యేకత. అందుకే వందకు పైగా పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించగలిగారు. నాటకరంగంలో ఔరా అనిపించుకుంటున్న ఆయన పేరు బుంగ మల్లికార్జున. చంద్రగిరి మండలం శానంబట్ల గ్రామానికి చెందిన ఈయన నాలుగు దశాబ్దాలుగా పాత్రోచితంగా నటిస్తూ అందరి మన్ననలందుకుంటున్నారు.











చంద్రమోహన్ నుంచి అందుకుంటున్న అవార్డు



తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)



నటనలోనూ ఆయన రైట్‌రైట్..

● వృత్తి,ప్రవృత్తుల్లో రాణిస్తున్న ఆర్టీసీ కండక్టర్ మల్లికార్జున

వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తనకు చిన్నప్పుడే ఎన్టీఆర్ పౌరాణిక పాత్రలు ప్రేరణగా నిలిచాయని చెప్పే మల్లికార్జున 1983లో బాలసుబ్రహ్మణ్యం వద్ద నటనలో శిక్షణ పొందారు. తొలిసారిగా ఎస్వీయూలో 'ఊహాజీవులు'లో కవి పాత్రతో నాటకరంగంలో ప్రవేశించారు. 'మంచంమీదమనిషి' నాటకంలో వైద్యుడి పాత్ర అవకాశం వచ్చింది. తర్వాత వెనకతిరగకుండా నాటకాల్లో నిలదొక్కుకున్నారు. డిగ్రీ పూర్తయ్యాక 1988లో ఆర్టీసీ కండక్టర్‌గా చేరారు. ఉద్యోగం చేస్తూనే నాటకరంగంలో వివిధ అవకాశాలను అందిపుచ్చుకుని ప్రేక్షకుల మన్ననలకు పాత్రులయ్యారు. 1994లో 'భక్తమార్కండేయ' వీధినాటంలో 'యముడు' పాత్ర అద్భుతంగా పోషించారు. జానపద గురువు ప్రకాష్‌రాజు, పౌరాణిక గురువు సుందరబాబుల శిష్యుడిగా ఇరవై ఏళ్లుగా విభిన్న పాత్రలతో రాణించారు. శ్రీనివాసకల్యాణం నాటకంలో మహావిష్ణువు, వరాహమూర్తిగా ద్విపాత్రాభినయం చేసేవారు. ఇప్పటి వరకు మల్లికార్జున వందకు పైగా పాత్రలు ధరించారు. దాదాపు 250 నాటకాల్లో పాలుపంచుకున్నారు.



కేంద్రమంత్రి నుంచి మహాత్మగాంధీ అవార్డు అందుకుంటూ..



ఆర్టీసీ ఈడీ నుంచి అభినందనలు అందుకుంటున్న మల్లికార్జున

ప్రేక్షకాదరణే అవార్డుగా..

మా గ్రామంలో పదిమంది నటులను తయారుచేశాను. వచ్చే ఏడాది రిటైర్ అవుతున్నా. తర్వాత పూర్తిసమయం నాటకాలకు వెచ్చిస్తాను. ఊపిరి ఉన్నంత వరక నాటకాలు వేస్తుంటాను.పెద్ద అవార్డులు రాలేదని బాధపడేవాడినికాను. ప్రేక్షకుల చప్పట్లే ప్రోత్సాహాన్నిచ్చేవి.

-మల్లికార్జున

వందకుపైగా అవార్డులు : కళామతల్లి పుత్రుడిగా మల్లికార్జున 25కి పైగా పురస్కారాలు అందుకున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో కేంద్రమంత్రి మహమ్మద్‌ఖాన్ చేతులమీదుగా మహాత్మగాంధీ ఎక్సలెన్స్ అవార్డు తీసుకున్నప్పుడు మధురానుభూతి కలిగిందంటారు మల్లికార్జున. వివిధ రాష్ట్రాల్లో రెండుసార్లు రాష్ట్ర ఉత్తమనటుడు, అభినయ గాన గంధర్వ లాంటి పలు విశిష్ట పురస్కారాలు అందుకున్నారు.

సివిల్ సర్వీస్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

తిరుపతి(క్రీడలు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జట్లను ఎంపిక చేసినట్లు డీఎస్‌డీఈవో సయ్యద్‌సాహెబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 29, 30 తేదీలలో తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వారు ఈనెల 6నుంచి 9వ తేదీ వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు.

ఎంపికైన క్రీడాకారుల వివరాలిలా...

● క్రికెట్ : ఎస్.వెంకటేశ్వర్(కలెక్టర్), కె.ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్.లోకేశ్, కె.సురేష్, జి.పురుషోత్తం, ఎం.సురేష్, వి.తుకారాం, ఎస్.రమేష్‌నాయక్, మున్నెయ్య ●అథ్లెటిక్స్ : టి.యువజరాజ్, ఎం.సిసింద్రి, కె.శివకుమార్, బి.గిరిబాబు, ఎస్.పవన్‌కుమార్, ఎస్.కె.జావిద్, ఐ.మణెయ్య, ఎస్.వి.సుబ్బయ్య, వి.తుకారాం, ఎ.చంద్రబాబు, కె.సురేష్, డి.పవన్‌కుమార్, సి.రెడ్డెమ్మ, పి.ప్రియాంక, పి.కుమారి. ●హాకీ : ఎం.ప్రసన్నలక్ష్మి, ఎస్.జ్యోత్స్న, ఎల్.భార్గవి, పి.ప్రియాంక, పి.వరప్రసాద్. ●కబడ్డీ : ఎస్.హేమనాథరాజ్‌కుమార్, ఎ.భారతి, ఎస్.అజరుద్దీన్, వి.హరిప్రసాద్. ●పవర్‌లిఫ్టింగ్ : ఎం.వెంకటేష్, ఎ.సాయిప్రదీప్, ఎస్.కె.జావిద్ ●స్విమ్మింగ్ : ఎస్.చంద్రబాబు, ఎస్.కె.జావిద్ ●టెన్నిస్ : ఎస్.శ్రీరాఘవ, ఎస్.రమేష్‌నాయక్ ●టేబుల్ టెన్నిస్ : రెడ్డిప్రసాద్, సుకుమార్, వి.కిరణ్, ఎల్.భార్గవి, ఎం.ప్రసన్నలక్ష్మి ●వాలీబాల్ : ఎస్.సాయికౌషిక్, ఎస్.మణిగండ, ఎం.సురేష్, డి.పవన్‌కుమార్, ఎస్.పవన్‌కుమార్, కె.ప్రసన్న, పి.కుమారి ●కుస్తీ : ఎం.హేమంత్‌కుమార్, ఎం.వేణు, ఎ.సాయిప్రదీప్, ఎస్.దర్శిని ●వెయిట్ లిఫ్టింగ్ : ఎ.కె.జావిద్ ●ఖోఖో : డి.పవన్‌కుమార్, ఎస్.ప్రవీణ్‌కుమార్, కె.సెల్వరాజ్, పి.ప్రియాంక ● బెస్ట్‌ఫిజిక్ : ఎం.వెంకటేష్, ఎస్.కె.జావిద్ ●యోగా : ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్.మంజుల, జె.పుష్పలత, కె.వేదవతి, ఎం.సందీప్ ●క్యారమ్స్ : వి.శ్రీనివాసులు, ఎస్.లక్ష్మీకాంత్, ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్.రమేష్‌నాయక్, సుకుమార్, ఎం.సందీప్, ఎస్.మంజుల, జె.పుష్పలత ●చదరంగం : ఎం.నరేంద్రనాథచౌదరి, బి.గిరిబాబు, ఎం.సందీప్, ఎస్.మంజుల, జె.పుష్పలత ●ఫుట్‌బాల్ : ఎం.నవీన్‌కుమార్, వినోద్‌కుమార్ ●బ్యాడ్మింటన్ : శశిభూషణ్‌రావు, కె.వి.నాగేంద్ర, పి.కల్యాణ్, కె.గోపీనాథ్, ఎస్.ప్రసాద్, అబ్దుల్ అజీజ్, కె.వేదవల్లి, సి.రెడ్డెమ్మ.

రూ.30కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా

● రహస్యంగా గదుల నిర్మాణం
● తిరుపతి రూరల్ టీడీపీ నేత నిర్వాకం



కబ్జా స్థలంలో నిర్మించిన గదులు



కాలువపై ఏర్పాటు చేసిన రోడ్డు

తిరుపతి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర శివారు ప్రాంతాల్లో భూమి విలువ ఆకాశాన్నంటుతుండడంతో భూ బకాసురుల కన్ను అటువైపు పడింది. గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా సాగిన కబ్జాల పర్వం కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. కాలువ పోరంబోకు, ప్రభుత్వ భూములను అన్వేషించి రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమించేస్తున్నారు. తిరుపతి రూరల్ మండలం మంగళం గ్రామ లెక్క దాఖలు, సర్వే నెంబరు 114లో దాదాపు రూ.30కోట్లు విలువైన ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. మంగళం-శెట్టిపల్లె 80 అడుగుల ప్రధాన రహదారికి పడమర దిశగా తిమ్మినాయుడుపాళెం, మంగళం చెరువుల నుంచి వచ్చే కాలువకు ఎగువన ఈ భూమిపై కన్నేసిన టీడీపీ తిరుపతి రూరల్ మండల నేత రాత్రికి రాత్రే చదును చేసి, వరుస క్రమంలో మూడు గదులను నిర్మించేశాడు. మరిన్ని నిర్మించడానికి మెటీరియల్ సిద్ధం చేసుకున్నాడు. వాహనాల రాకపోకలకు అనువుగా కాలువపై సిమెంట్ పైపులు పరిచి రోడ్డు సైతం ఏర్పాటు చేసుకున్నారు. కాలువ పోరంబోకులో గతంలో నిర్మాణాలు చేపట్టినా రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో విరమించుకున్నారు. ఈ ప్రాంతం జనసంచారానికి కాస్త దూరంగా ఉండడంతో యధేచ్ఛగా నిర్మాణాలు చేసేస్తున్నారు. చుట్టుపక్కల మండలాల్లో రెవెన్యూ భూములకు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నా ఇక్కడ మాత్రం కానరాలేదు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కృషి

● రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్

రేణిగుంట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కృషి చేస్తామని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చెప్పారు. రైల్వేశాఖ ఆధ్వర్యంలో జరిగే 'ఆన్ ది స్పాట్ స్టడీ టూర్' నిమిత్తం జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం దూరంతో ఎక్స్‌ప్రెస్‌లో రమేష్ సారథ్యంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. వీరికి సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్‌ఎం విజయకుమార్, తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షురాలు తేజోవతి ఘనస్వాగతం పలికారు. అనంతరం సీఎం రమేష్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని తిరుపతి, రేణిగుంట, గుంతకల్లు, గూడూరు, విజయవాడ, విశాఖపట్టణంతో పాటు హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు, సదుపాయాలను కల్పించే దిశగా చేపట్టాల్సిన అంశాలపై రైల్వే అధికారులతో సోమవారం చర్చిస్తామన్నారు. అలాగే రైల్వేస్టేషన్ల తనిఖీ కూడా ఉంటుందన్నారు. అనంతరం బీజేపీ రేణిగుంట మండల బీజేపీ అధ్యక్షురాలు తేజోవతి సంత గేటు వద్ద వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనా ఇంత వరకు పనులు మొదలుపెట్టలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.



రేణిగుంట రైల్వేస్టేషన్‌లో స్టాండింగ్ కమిటీ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

భీష్మయ్యనాయుడికి నేతల నివాళులు

● హాజరైన రాజకీయ, సినీ ప్రముఖులు

చంద్రగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీటీడీ విశ్రాంత హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బొజ్జా భీష్మయ్యనాయుడు కుటుంబ సభ్యులను పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పరామర్శించారు. గత నెల 21వ తేదిన ఆయన అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన స్వగ్రామమైన చంద్రగిరి మండలం శేషాపురంలో కర్మక్రియలు జరిగాయి. విజయ్ ఎలక్ట్రానిక్స్ చైర్మన్ దాసరి జైరమేష్, తిరుపతి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, ఎస్సీవీ నాయుడు, కిమ్స్ హాస్పిటల్ ఎండీ బొల్లినేని భాస్కర్ రావు, సినీ నటుడు రఘుబాబు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, గాలి రాజేంద్రనాయుడు, ఆర్సీపురం మాజీ జడ్పీటీసీ దేవానందనాయుడు, సుధాకర్‌చౌదరి, భూపాల్‌నాయుడు, కిమ్స్ హాస్పిటల్ సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ సీఎస్ నాయుడు, టీటీడీ మాజీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వాసుదేవనాయుడు తదితరులు హాజరయ్యారు. భీష్మయ్యనాయుడు చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబీకులను పరామర్శించారు.



భీష్మయ్యనాయుడు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విజయ్ ఎలక్ట్రానిక్స్ చైర్మన్ దాసరి జైరమేష్

భీష్మయ్యనాయుడు కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, సినీనటుడు రఘుబాబు



వైసీపీ కౌన్సిలర్‌పై వీఆర్వో ఫిర్యాదు

సూళ్లూరుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రాఘవయ్యపేట వీఆర్వో నీలిమ వైసీపీకి చెందిన 20వ వార్డు కౌన్సిలర్ మునీంద్రబాబుపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల ఒకటో తేదీన 20వ వార్డు ఇసుకమిట్టలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సమయంలో తనను కౌన్సిలర్ అసభ్యంగా మాట్లాడి విధులకు ఆటంకం కలిగించాడని ఆమె పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సోషల్ మీడియాలో ఎమ్మెల్యేపై అసభ్యకర పోస్టులు

● వ్యక్తిపై కేసు నమోదు

చిల్లకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌పై అసభ్యకరమైన పదజాలంతో పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఆదివారం చిల్లకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గూడూరు తూర్పువీధి ప్రాంతానికి చెందిన ఉన్నం వినీష్. టీడీపీ సీనియర్ నేత తానంకి నానాజీ ఫొటోతో ఫేస్ బుక్ ద్వారా ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు చేస్తూ, అసభ్యకర పదజాలంతో దూషించి ప్రచారం చేశారు. తానంకి నానాజీ అందుబాటులో లేకపోవడంతో ఆయన డ్రైవర్ నాగరాజు ఫిర్యాదు మేరకు వినీష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మినీలారీ - ఆటో ఢీ: ఒకరి మృతి



మృతి చెందిన ఆటో డ్రైవర్

తిరుచానూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు ఫ్లైఓవర్ మీద మినీలారీ- ఆటో ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. తిరుచానూరు ఎస్‌ఐ అరుణ తెలిపిన వివరాలు మేరకు.. బీఎన్‌కండ్రిగ మండలం అలత్తూరుకు చెందిన మనోహర్(43) ఆటో నడుపుతుంటాడు. ఆదివారం తిరుచానూరు పద్మశాలి భవన్ వైపు నుంచి రాంగ్‌రూట్‌లో తాజ్ హోటల్ వెళ్లడానికి ఫ్లైఓవర్ ఎక్కాడు. అదే సమయంలో చంద్రగిరి నుంచి నాయుడుపేటకు వెళుతున్న మినీలారీ వచ్చి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మనోహర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇతడు చనిపోయాడు. ప్రమాదం జరిగాక 108 వాహనం సకాలంలో రాలేదని అక్కడున్న వాహనచోదకులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 88.076 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 36.829 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

వైభవంగా తిరుమలనంబి శాత్తుమొర

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ భక్తుడైన తిరుమల నంబి శాత్తుమొర ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీవారి తీర్థకైంకర్యాన్ని తిరుమలనంబి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆదివారం శ్రీవారి ఆలయం పక్కనే ఉన్న తిరుమలనంబి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామానుజాచార్యుల అంశతో జన్మించిన మనవాళ మహాముని శాత్తుమొర ఈనెల 6న జరుగనుంది. 9న అత్రి మహర్షి, పిళ్లైలోకాచార్య, పోయిగై ఆళ్వార్, శ్రీభూదత్తాళ్వార్ల తిరునక్షత్రోత్సవాలతో పాటు వేదాంత దేశికాచార్య శాత్తుమొర కూడా జరుగనుంది. 10న పేయాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 11న యాజ్ఞవల్క్య జయంతి జరుగనున్నాయి. తిరుమల శ్రీవారికి ఏడాది పొడవునా అనేక ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా, శ్రీవారి పరమ భక్తుల తిరు నక్షత్రోత్సవాలు కూడా టీటీడీ ఘనంగా నిర్వహించడం విశేషం.

రోటరీ క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవం



మాట్లాడుతున్న రోటరీక్లబ్ ప్రధాన కార్యదర్శి జలీల్ అహ్మద్

కోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోటలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో ఆదివారం రోటరీ క్లబ్ టౌన్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. రోటరీ క్లబ్ గవర్నర్ మునిగిరీష్, వాసుగౌడ్‌ల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహిం చారు. రోటరీక్లబ్ కోట టౌన్ అధ్యక్షుడుగా నెల్లూరుపల్లి కొత్తపాళెంకు చెందిన నెల్లూరు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోటకు చెందిన షేక్ జలీల్ అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా మొుదిన్‌బాషా, పసుపులేటి కిషోర్, కృష్ణమూర్తి, వంశీ, మధుయాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త పాలకమండలిని రోటరీ క్లబ్ ప్రతినిధులు, గవర్నర్‌లు అభినందించారు.

గోపీకృష్ణ కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ శనివారం ప్రమాదానికి గురైన మృతిచెందిన గోపీకృష్ణ కుటుంబానికి సంబంధిత కర్మాగార యాజమాన్యం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియాను అందించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక చవటపాళెం సమీపంలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో శనివారం షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గోపికృష్ణ అనే యువకుడు ప్రమాదానికి లోనై మృతిచెందడం విషాదకరమన్నారు. పరిశ్రమలో ఇటువంటి ప్రమాదకర ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోగి శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, శ్రీనివాసులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



గూడూరు, నవం బరు 3 (ఆంధ్రజ్యోతి): బలిజ విద్యార్థులకు ఆదివారం నెల్లూరు కాపు భవనంలో నగదు ప్రతిభా ప్రోత్సాహక బహుమతులను అందజేసినట్లు బలిజ మహిళా సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మీ తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరం 10 తరగతిలో ప్రతిభచాటిన విద్యార్థులకు మంత్రి నారాయణ చేతులమీదుగా నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశామని, గూడూరు నుంచి ఆరుగురు విద్యార్థులు పురస్కారాలను అందుకున్నారని పేర్కొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



గూడూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడవయ్యకాలనీలోని గాడ్‌గ్రేస్ సొసైటీ అనాథశరణాలయంలో ఆదివారం వృద్ధులకు బాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కూరపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ చలికాలంలో వృద్ధులకు, ఆశ్రయం పొందుతున్న వారికి ఇబ్బందులు లేకుండా దుప్పట్లను అందజేశామనానరు. జాన్‌పాల్, యశ్వంత్, రహంతుల్లా పాల్గొన్నారు.

డిసెంబరు 7న ఆదిశంకర విద్యార్థుల క్రికెట్ మ్యాచ్



క్రికెట్ పోటీల పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, నవం బరు 3 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న ఆదిశంకర విద్యార్థుల క్రికెట్ మ్యాచ్ జరగ నుంది. దీనికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులందరూ ఓ వేదికగా కలవడం సంతోష దాయకంగా ఉంటుందన్నారు. స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వపు విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల టీమ్‌లు తలపడడం మంచి సంప్రదాయమని పేర్కొన్నారు. ఆటలతో స్నేహ సంబంధాలు మెరుగవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీ గుడ్లూరు రవిచంద్ర, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



అఖిలప్రియకు ప్రసాదాలు అందిస్తున్న సహాయ కమిషనర్

సూళ్లూరుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరు పేటలోని చెంగాళమ్మ పర మేశ్వరి అమ్మ వారిని ఆదివారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ దర్శించుకొన్నారు. ఎమ్మె ల్యే భూమాకు సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, బండారు ఆంజనేయులు, రమణయ్య పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి ఘన సన్మానం



నాయుడుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మలేషి యాలో జరిగిన మాస్టర్ అథ్లెటిక్ పోటీలలో నాయుడుపేటకు చెందిన గుంటూరు వెంకటరావు ప్రతిభ కనబరిచారు. వెంకట రావు ఆయన సతీమణిని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వ ర్యంలో సత్కరించారు. హైజంప్‌లో బంగారు పతకం, ట్రిపుల్ జంప్‌లో వెండిపతకం, లాంగ్ జంప్, 200 మీటర్ల పరుగు పందెంలో నాల్గవ స్థానం సాధించిన వెంకటరావును అభినందించారు. డీఎల్‌పీవో రవీంద్రబాబు, ఏవో భువనేశ్వరశర్మ, ఈవోపీఆర్‌డీ మల్లుగోపాల్, ఏపీఎం ఉమాదేవి, పరమశివం తదితరులు ఉన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

దూషించాడు.. ప్రశ్నిస్తే దాడిచేశాడు

బాలాయపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలకు పొరుగింటివారే కారణమని భావించి దూషణలకు దిగడంతో పాటు నిలదీసిన వారిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని జయంపు గ్రామానికి చెందిన ఆనం లక్ష్మయ్య శనివారం అర్ధరాత్రి బూతులతో రెచ్చిపోయాడు. తన ఇంట్లో గొడవలకు పక్కింటి శివ్వాడి జనార్ధన్‌రెడ్డి కుటుంబమే కారణమని దూషణలకు దిగాడు. దీన్ని భరించలేని జనార్ధన్‌రెడ్డి అతడిని నిలదీశాడు. దీంతో లక్ష్మయ్య అతడిపై కర్రతో దాడిచేశాడు. అడ్డుకోబోయిన ఆయన భార్య లలితమ్మ, కుమారుడు కల్యాణ రెడ్డిలపైనా దాడిచేసి గాయాలపాలు చేశాడు. గాయపడ్డ ముగ్గురినీ వైద్యం కోసం చెన్నైకు తరలించారు. ఎస్ఐ గోపి కేసు నమోదు చేశారు.

షిరిడి సాయిబాబా ఆలయంలో అన్నదానానికి రూ.10వేల విరాళం

నాయుడుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట బ్రాహ్మణవీధిలోని షిరిడి సాయిబాబా ఆలయ నిత్య అన్నదాన పథకానికి లీలావతమ్మ రూ.10,011లు విరాళం అందజేశారు. గనగలూరి సుబ్బరామిరెడ్డి, వారి కుమారుల జ్ఞాపకార్థం ఈ నగదు అందజేశారు.

ఆంగ్ల సర్టిఫికెట్ కోర్సు శిక్షణకు హెచ్‌ఎం పెంచలయ్య ఎంపిక



డక్కిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరులోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆంగ్ల సౌత్ ఇండియా జ్ఞానభారతి క్యాంపస్‌లో 30 రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులకు డక్కిలి మండలం దేవుడువెల్లంపల్లి ఎస్టీకాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూడల పెంచలయ్యను ఎంపిక చేసినట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంగ్లీష్ సర్టిఫికెట్ కోర్సు 30 రోజుల పాటు జరుగుతుందన్నారు. ఇంగ్లీష్ సులభంగా బోధించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 25 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొంటారని చెప్పారు. తిరుపతి జిల్లా నుంచి డక్కిలి, పెళ్లకూరు మండలాలకు చెందిన దూడల పెంచలయ్య, బాలసుబ్రమణ్యం అనే ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు వివరించారు. శిక్షణ పూర్తయిన తర్వాత వారు ఇక్కడి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారని తెలియజేశారు.

మత్స్యకారులకు టీడీపీ సభ్యత్వాలు



కోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలోగల గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలో ఆదివారం టీడీపీ సభ్యత్వం ముమ్మరంగా సాగింది. ఆ పార్టీ సీనియర్ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామంలోని పలువురు కాపులు స్వచ్ఛందంగా సభ్యత్వాలు స్వీకరించారు. టీడీపీ సభ్యత్వం వల్ల కలిగే ఉపయోగాలు, బీమా సౌకర్యాల గురించి ఆయా నాయకులు వివరిస్తూ సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంగల్‌రావు, మురళి, చల్లా సురేష్, వెంకయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల చోరీ.. కేసు నమోదు

నాయుడుపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లోతువానిగుంట స్వర్ణముఖినది సమీపంలో మున్సిపాలిటీకి సంబంధించిన 5 విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి




వాకాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపురం గ్రామం శివార్లలో ఆదివారం కోడిపందేల స్థావరంపై ఎస్ఐ నాగబాబు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1390 నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశారు.

మంత్రిని కలిసిన జనసేన నాయకులు



గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రమంలో ఆదివారం మంత్రి నాదెళ్ల మనోహర్‌ను గూడూరు జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గూడూరు నియోజకవర్గ పరిధిలో జనసేన బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, కూటమి ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచిం చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కొణిదల మునిగిరీష్, పేటేటి చంద్రనీల్, కొమ్మా రవీంద్రబాబు, ఇంద్రవర్ధన్‌కుమార్, నయూం, హసన్ పాల్గొన్నారు.





ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు, గూడలిలో సంగమేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న పండితులు

అంకమ్మకు సహస్ర దీపాలంకరణ

కోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణ పరిధిలోని శ్యామసుందర పురంలో గల గ్రామ దేవత అంకమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి కార్తీకమాస పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలను వెలిగించారు. మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షిదేవి సమేత సంగమేశ్వర ఆలయంలో ఆదివారం కార్తీకమాస పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేసి విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి ఆధ్వర్యంలో సంగమేశ్వరుడు, కామాక్షి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం జరిగింది. భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతులు సమర్పించారు.

గూడూరు 3వ వార్డులో సమస్యల తిష్ట

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక 3వ వార్డులో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు, రోడ్లు అధ్వానంగా మారడంతోపాటు వీధి దీపాలు వెలగడం లేదు. పట్టణంలోని 3వ వార్డులో జనార్దన్‌రెడ్డికాలనీ, సాధుపేట, చాకలి వీధి తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో 600లకు పైగా నివాసగృహాల్లో సుమారు 2000మంది వరకు జీవనం సాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ వార్డులో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టక పోవడంతో సమస్యలు తిష్టవేశాయని స్థానికులు చెబు తున్నారు. ప్రధానంగా జనార్దన్‌రెడ్డికాలనీలో సీసీ రోడ్లు ధ్వంసమై ఉన్నాయి. కల్వర్టుకు మధ్యలో భారీ గోతులు ఏర్పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయాల్లో కల్వర్టుకు ఉన్న గుంత కనిపించక పోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహన దారులుప్రమాదాలబారిన పడుతున్నారు. చాకలివీధిలో కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేవు. మట్టిరోడ్లు దర్శన మిస్తున్నాయి. డ్రైనేజీ కాలువలు పూర్తిగా అభివృద్ధిపరచకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్వాసన భరించలేకున్నారు. దోమలు పెరిగి విషజ్వరాలు సోకుతున్నాయని వాపోతున్నారు. సాధుపేటలో వీధిదీపాలు సక్ర మంగా వెలగకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారం అలముకుంటోంది. విషసర్పాల భయం వేధిస్తోంది. అధికారులు స్పందించి 3వ వార్డులోని సమస్యలను పరిష్కరించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.







చాకలివీధిలో అధ్వానంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ కాలువలు ● జనార్ధన్‌రెడ్డి కాలనీలో కల్వర్టుకు ఏర్పడిన గుంత ● సాధుపేటలో వెలగని వీధి దీపాలు

నేరాల నియంత్రణకు కార్డెన్ సర్చ్



కార్డెన్‌సర్చ్ కార్యక్రమంలో పోలీసులు

గూడూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు కార్డెన్ సర్చ్ కార్యక్రమం నిర్వహించామని పోలీస్ అధికారులు తెలిపారు. ఆదివారం స్థానిక అడవయ్యకాలనీ ప్రాంతంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు, అను మానితుల సంచారం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కొత్తవ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇచ్చే సమయంలో వారి పూర్తి వివరాలను పరిశీలించి ఇవ్వాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలు వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస్, శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, ఎస్ఐలు మనోజ్‌కుమార్, సురేష్ బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● రెండోపట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘూతం కలిగిస్తే కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

అనుమానితుల సమాచారం ఇవ్వాలి: డీఎస్పీ



మేనకూరులో కార్డెన్ సెర్చ్‌లో విచారిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా అనుమానిత వ్యక్తులు వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నాయుడుపేట - మేనకూరు పారిశ్రామిక వాడలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో ఆదివారం ఉదయం డీఎస్పీ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మేనకూరు సెజ్‌లోని పరిశ్రమల్లో పనిచేసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి కార్మికులు వచ్చి నివాసం ఉండటంతో కార్డెన్ సెర్చ్ నిర్వహించి వారి వివరాలను తెలుసుకొని వారి ఐడి కార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వేధింపుల విషయంలో మహిళలు నిర్భయంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. వాహనదారులు అన్ని ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. అర్బన్ సీఐ బాబి, ఎస్ఐలు అజయ్‌కుమార్, శ్రీహరిబాబు, సిబ్బంది ఉన్నారు.

మాంబట్టులో స్విమ్స్ మెగా వైద్య శిబిరం



మందులను అందజేస్తున్న స్విమ్స్ వైద్యులు మునస్వామి, గ్రామపెద్దలు

తడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాంబట్టు పంచాయతీ చిన్నమాంబట్టు దళితవాడలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తిరుపతి సిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ వైద్యశిబిరంలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ వంటి 8 ప్రత్యేక వైద్యసేవలు అందించే వైద్యులు చికిత్సలు అందించారు. అలాగే పింక్‌బస్సు ద్వారా మమోగ్రామ్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. సుమారు 300 మంది రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన స్విమ్స్ వైద్యులు మునస్వామి, సర్పంచ్ రమణయ్య, గ్రామపెద్దలు వేనాటి రాజారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, పురుషోత్తం, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలం లోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలిసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి నైవేద్యం నివేదించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సమస్యల వలయంలో ఆర్యభట్టనగర్

సూళ్లూరుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఆర్య భట్టనగర్ సమస్యల వలయం లో చిక్కుకుంది. ఇక్కడ సామాన్య జనంతో పాటు విశ్రాంత షార్, ఇతర ఉద్యోగులు నివాసం ఉంటున్నారు. మున్సి పాలిటీ పరిధిలోకి వచ్చినా కనీస వసతులు కూడా లేదు. సీసీ రోడ్లు లేక పోవడంతో చిన్నపాటి వర్షమొచ్చినా ఉన్న మట్టి రోడ్లు రొచ్చురొచ్చుగా మారుతున్నాయి. నివాసాల నడుమ ఉన్న ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఖాళీస్థలాల్లో ఇటు మురుగునీరు, అటు వర్షపు నీరు నిలిచిపోయి దోమలకు, పందులకు అవాస కేంద్రాలుగా మారుతున్నాయి. తాగునీరు కూడా కాలనీ వాసులకు సక్రమంగా అందడం లేదు. రెండు రోజుకొకసారి మాత్రమే మున్సిపాలిటీ నీరు అందుతోందని కాలనీ వాసులు చెబుతున్నారు. ఇళ్ల మధ్యలో పలుచోట్ల ముళ్ల పొదలు పెరిగిపోయాయి. ఎక్కడచూసినా మురుగు దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.







ఇళ్ల మధ్యవున్న ఖాళీ స్థలంలో నిలిచిపోయిన మురుగునీరు, నివాసాల నడుమ దట్టంగా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, సీసీ రోడ్లు లేక ఇలా ఉన్న మట్టిరోడ్లు